ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్
కోనసీమ
జిల్లా వార్తలు
మంగళవారం 18 నవంబరు 2025 | 5



ఏం జరిగిందో.. ఏంటో?

● ఇద్దరు పిల్లలతో తండ్రి అదృశ్యం
● దిండి - చించినాడ వంతెనపై వస్తువులు
● గోదావరిలో దూకారేమోనని అనుమానాలు 7



కలెక్టరేట్ పీజీఆర్ఎస్ ద్వారా 223 అర్జీలు స్వీకరణ

అమలాపురం టౌన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ ద్వారా అందిన అర్జీల సమస్యల పరిష్కారం కోసం అధికారులు వ్యక్తిగత బాధ్యత వహించాలని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి పేర్కొన్నారు. సమస్యలను సులభంగా, సమయం వృథాకాకుండా క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉన్న సంబంధిత అధికారులకు నేరుగా చేరవేసి సమస్యలకు పరిష్కారం చూపించేందుకు పీజీఆర్ఎస్ కీలకంగా పనిచేస్తుందన్నారు. కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి జేసీ ఆధ్వర్యంలో ఉన్నతాధికారులు 223 అర్జీలను స్వీకరించారు. రెవెన్యూ, పంచాయతీరాజ్, పాఠశాల విద్య, వ్యవసాయ తదితర శాఖలకు సంబంధించిన సమస్యలపై ప్రధానంగా అర్జీలు అందాయన్నారు. నిర్ణీత గడువులోగా సమస్యలను పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను జేసీ ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.మాధవి, జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో అర్జీలు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ నిషాంతి, డీఆర్వో మాధవి తదితరులు



ఎస్పీ కార్యాలయంలో 30 ఫిర్యాదులు

అమలాపురం టౌన్, నవంబరు17(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి 30 ఫిర్యాదులను ఎస్పీ రాహుల్‌మీనా స్వీకరించారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించడంతోపాటు సంబంధిత సమస్యలు, అభ్యర్థనలను నేరుగా విన్నారు. కుటుంబ తగాదాలు, ఆస్తి తగాదాలు వంటి అంశాలపై ఫిర్యాదులు అందాయన్నారు. పీజీఆర్ఎస్ సమస్యల పరిష్కారం విషయంలో క్షేత్రస్థాయి అధికారులు నిర్లక్ష్యం వహించరాదని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులపై తక్షణమే విచారణ జరిపి వారంలోగా పురోగతి నివేదిక సమర్పించాలన్నారు. ప్రతీ ఫిర్యాదుదారునికి న్యాయం అందించడమే లక్ష్యమని ఎస్పీ పేర్కొన్నారు.

అర్జీదారుల సమస్య వింటున్న ఎస్పీ రాహుల్‌మీనా

పులుగుర్తేగా!





విశాఖలో జరిగిన సీఐఐ సదస్సులో రెండు రోజులూ మంత్రి లోకేశ్ షర్ట్‌పై చేనేత జాకెట్లు ధరించారు. తాను ధరించిన చేనేత జాకెట్ వివరాలను శనివారం 'ఎక్స్'లో పంచుకున్నారు. 'ఈ జాకెట్ మిలన్ లేదా ముంబైలో తయారైంది కాదు. తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మండలం పులుగుర్త అనే చిన్నగ్రామంలో తయారు చేసింది' అని లోకేశ్ పేర్కొన్నారు. దీంతో పులుగుర్త గ్రామం వైపు అందరి చూపు పడింది.. అసలు ఆ గ్రామంలో ఏం జరుగుతుందనే దానిపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

» ట్రెండ్‌కు అనుగుణంగా తయారీ
» పులుగుర్త వస్త్రాలకు డిమాండ్
» లోకేశ్ మది దోచిన వైనం
» విశాఖ సదస్సులో ప్రత్యేక ఆకర్షణ

అనపర్తి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికులు మారుతున్న కాలానికి అనుగుణంగా తమ మగ్గం నుంచి ప్రముఖ మిల్లులకు దీటుగా మనసు దోచే వస్త్రాలు నేస్తున్నారు.. తమకు డిమాండ్ సృష్టించుకుంటున్నారు. తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మండలం పులుగుర్తలో స్వాతంత్ర్యం రావడానికి నాలుగు నెలల ముందే చేనేత సొసైటీ ఏర్పాటు చేశారు. అనపర్తి మండలంలోని పులుగుర్త, కుతుకులూరు, రామవరం, పెదపర్తి గ్రామాల్లోనే కాకుండా రాయవరం మండలం సోమేశ్వరం, మాచవరం గ్రామాల్లో కూడా నేత కార్మికులు ఈ సొసైటీలో సభ్యులుగా కొనసాగుతున్నారు. ప్రస్తుతం సుమారు మూడు మండలాల పరిధిలో 400 మంది నేతన్నల కుటుంబాలతో సొసైటీ ముందుకు సాగుతోంది. ఒకప్పుడు పని లేని కాలం నుంచి ప్రస్తుతం చేతి నిండా పని దొరికే సొసైటీగా పులుగుర్త సొసైటీలోని కార్మికులు జీవనం సాగిస్తున్నారు. పులుగుర్త సొసైటీలో చీరల నుంచి దోవతీల వరకు సుమారు 80 రకాల వస్త్రాలను తయారుచేస్తూ దేశంలోనే వివిధ రాష్ట్రాల్లో విక్రయాలు సాగిస్తున్నారు.

మార్కెట్‌లో మంచి గిరాకీ..

పులుగుర్త చేనేతలు అనేక రకాల చీరలు నేసినప్పటికీ వీరు తయారు చేసిన జకార్డు, జాంధానీ, కుప్పడం, మల్కా చీరలకు గిరాకీ ఉంటుంది. పురుషులు ధరించే షర్టులకు గిరాకీ ఉంది. పంచెల నుంచి కర్చీఫ్‌ల వరకు ఇక్కడి నేతన్నలు తయారుచేస్తారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 52 సొసైటీలు ఉన్నా పులుగుర్త సొసైటీ అగ్రగామిగా నిలవడమే కాకుండా వ్యాపారంలో కూడా తన సత్తా చాటుతోంది. సొసైటీ నుంచి ఆప్కో సంస్థ ఏడాదికి రూ.10 లక్షల వస్త్రాలు కొనుగోలు చేస్తుండగా ద్వారపూడిలోని పులుగుర్త బ్రాంచి ద్వారా ఏడాదికి రూ. 45 లక్షల వస్త్రాలు విక్రయిస్తుంది. పులుగుర్తలో ఏర్పాటుచేసిన విక్రయ కేంద్రం ద్వారా ఏడాదికి రూ.70 లక్షల వరకు విక్రయిస్తూ లాభాలను ఆర్జిస్తుంది. పులుగుర్త చేనేత సొసైటీ ఆరు సార్లు రాష్ట్ర ప్రభుత్వం తరపున అవార్డులకు ఎంపిక కాగా.. ఒక పర్యాయం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక బహుమతితో ప్రోత్సహించింది.

దూది నుంచి నూలు..

దూది నుంచి నూలు తయారు చేయడం వాటిని మగ్గం ఎక్కించే వరకు చేయాల్సిన పనులను పూర్తి చేసి నేతన్నలకు అప్పగిస్తుంది ఈ సొసైటీ. అలా తమ వద్దకు చేరిన నూలుతో సొసైటీ వారు అప్పగించిన డిజైన్లతో చీరలు నేసి తిరిగి సొసైటీకి అప్పగించడంతో నేతన్నల పని పూర్తవుతుంది. నేతన్నలకు అందించే సొగరులో 48 గజాల చీర తయారవుతుంది. వీటిని ఎనిమిది ఆరు గజాల చీరలుగా విడదీసి విక్రయిస్తారు. అయితే ఒక్కొక్క చీర నేత విలువను బట్టి రూ.3 వేల నుంచి రూ.20 వేల వరకు ఉంటుంది. పులుగుర్త చేనేత సొసైటీ లాభాల బాటలో ఉండడంతో సభ్యులకు ప్రతి ఏడాది బోనస్‌తోపాటు డివిడెంట్లు అందించడంతో కార్మికుల కుటుంబాలకు ఊరట లభిస్తోంది.



నేతన్నలు తయారుచేసిన షర్టులు

ప్రభుత్వం ప్రోత్సహించాలి..



కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహిస్తే నేతన్నల జీవితాలు మరింత బాగుపడతాయి. పులుగుర్త చేనేత సొసైటీకి ప్రభుత్వం నుంచి రావాల్సిన సుమారు రూ.కోటి వరకు బకాయిలు విడుదల చేస్తే కార్మికులకు చేయూతను అందించినట్లవుతుంది.

\- పేరిశెట్టి లాలయ్య పులుగుర్త చేనేత సహకార సంఘం మాజీ అధ్యక్షుడు



పులుగుర్తలో దూది నుంచి నూలు తీసే ఆధునిక యంత్రం



కొబ్బరి డీలా..

» తగ్గుతున్న ధరలు » ఇతర రాష్ట్రాల్లో పెరిగిన కొబ్బరి ఉత్పత్తులు
» కొబ్బరి ధరకు మూఢం ఎఫెక్ట్.. ముగిసిన పండుగల సీజన్
» రూ.7 వేలకు పైగా దిగజారి రూ.19 వేలు పలుకుతున్న పచ్చికొబ్బరి
» ఉభయగోదావరి జిల్లాల 100 నుంచి 30 లారీలకు పడిన ఎగుమతులు
» నిరాశ నిస్పృహలకు గురవుతున్న కోనసీమ కొబ్బరి రైతులు

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

గత కొన్ని నెలల నుంచి రికార్డు స్థాయిలో ధర పలికిన 'కొబ్బరి' ధరల పతనం మళ్లీ ప్రారంభమైంది. కొబ్బరి ఉత్పత్తుల ఆధారిత రాష్ట్రాల్లో గణనీయమైన ఉత్పత్తులు రావడంతో ఆంధ్రప్రదేశ్ నుంచి కొబ్బరి ఎగుమతులు క్షీణించాయి. దీనివల్ల మార్కెట్ పతనం కావడానికి ప్రధాన కారణమని వ్యాపారులు భావిస్తున్నారు. అంతేకాకుండా కార్తీక మాసం ముగుస్తున్న వేళ మరో మూడు నెలలపాటు మూఢం రావడంతో పండుగలు, శుభ కార్యక్రమాలు లేకపోవడం వల్ల ధరలు పెరిగే పరిస్థితి లేదంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వంద లారీలకు పైగా కొబ్బరి ఉత్పత్తులు వివిధ రాష్ట్రాలకు ఎగుమతి అయ్యే పరిస్థితి నుంచి ఇప్పుడు ఆ సంఖ్య 30 లారీలకు పడిపోయింది. ఎగుమతులు నిలిచిపోవడంతో ధరలు పడిపోయి రైతులు కుదేలయ్యారు.

ఇతర రాష్ట్రాల ప్రభావం

కార్తీకమాసం ముగియడం.. శీతాకాలం ప్రారంభం కావడం.. ఇతర ప్రాంతాల్లో కొబ్బరి ఉత్పత్తి పెరగడం... మూఢంతో శుభ కార్యక్రమాలకు బ్రేక్ పడటం వంటి అంశాలు కోనసీమ కొబ్బరికి మార్కెట్‌లో ధరలు పతనానికి కారణమయ్యాయి. గత వారం రోజుల వరకు రికార్డుల స్థాయిలో ఉన్న పచ్చి కొబ్బరికాయల ధరలు ఒక్కసారిగా రూ.8 వేలు పడిపోవడంతో కొబ్బరి రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది జనవరిలో పచ్చి కొబ్బరికాయల ధర రూ.16 వేల నుంచి పెరగడం ప్రారంభమై రికార్డుస్థాయిలో రూ.27 వేల వరకు రైతులు ఊహించని రీతిలో ధరల్లో పెరగుదల కనిపించింది. అయితే ప్రస్తుతం పచ్చికొబ్బరికాయలు రూ.18 వేల నుంచి రూ.19వేల మధ్య ధర పలుకుతోంది. కాగా ఏడాది చివరిలో ఇతర రాష్ట్రాలలో ఉత్పత్తి పెరగడంతోపాటు ఇతర ప్రాంతాల్లో డిమాండ్ తగ్గడం వల్ల కొబ్బరి ధరలు గణనీయంగా పతనవ్వడం ప్రారంభించాయి. రానున్న నెలలో మరింత తగ్గే అవకాశాలు ఉన్నట్టు కొబ్బరి వ్యాపారులు విశ్లేసిస్తున్నారు. ఈనెల 26వ తేదీ నుంచి ప్రారంభమవుతున్న శుక్రమౌఢ్యం కారణంగా మరో 83 రోజులపాటు ఏ విధమైన శుభకార్యక్రమాలు లేకపోవడంతో కొబ్బరికి డిమాండ్ తగ్గింది. సంక్రాంతి పండుగల ప్రారంభం అనంతరం కొబ్బరి ధరలు పెరిగే అవకాశాలు ఉంటాయని వ్యాపారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం తమిళనాడు రాష్ట్రంలో ఉత్పత్తి ఊపందుకోవడంతో కోనసీమ ప్రాంతం నుంచి ఎగుమతి ఆర్డర్లు కూడా రావడంలేదని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఉభయ గోదావరి జిల్లాల నుంచి నిత్యం 80 నుంచి 100 లారీలు కొబ్బరి ఎగుమతులు జరగగా, నేడు ఆయా జిల్లాల నుంచి సుమారు 25 నుంచి 30 లారీలు మాత్రమే ఎగుమతులు జరుగుతున్నట్టు వ్యాపారులు చెబుతున్నారు. బిహార్, ఉత్తరప్రదేశ్, జార్ఖండ్, చత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్, రాష్ట్రాలకు ప్రస్తుతం నామమాత్రంగా ఎగుమతులు జరుగుతున్నాయి. ప్రస్తుతం కొబ్బరి మార్కెట్ ధరలు ఇలా ఉన్నాయి. కొత్త కొబ్బరి (క్వింటాల్) రూ.22 వేలు, కొత్త కొబ్బరి (రెండో రకం), కురిడీ కొబ్బరి(పాతవి) గండేరా(వెయ్యి) రూ.30 వేలు, గటగట (వెయ్యి)రూ.29 వేలు, కురిడీ కొబ్బరి (కొత్తవి) గండేరా (వెయ్యి) రూ.28 వేలు, గటగట (వెయ్యి) రూ.27 వేలు, నీటికాయ పాత(ముక్కుడు)(వెయ్యి) రూ.19వేల నుంచి రూ.20వేలు, కొత్త (పచ్చి) (వెయ్యి)రూ.19 వేలుగా ఉన్నాయి. రానున్న రోజుల్లో డిమాండ్ తగ్గి ధరలు మరింత పతనమయ్యే అవకాశాలు ఉన్నట్టు నిపుణులు అంచనా వేస్తున్నారు.



ఎగుమతి అవుతున్న కొబ్బరి

సివిల్ సర్వీస్ కోచింగ్‌కు ఉచిత శిక్షణకు దరఖాస్తులు

అమలాపురం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో సివిల్స్ సర్వీసెస్ పరీక్షలకు ఉచిత కోచింగ్ ఇవ్వడానికి దరఖాస్తులు కోరుతున్నట్టు వెనుకబడి తరగతుల సంక్షేమశాఖ జిల్లా అధికారి పి.జ్యోతిలక్ష్మీదేవి ఓ ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈనెల 25లోగా బీసీ సంక్షేమశాఖ కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలన్నారు. డిసెంబరు 5న స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించి అందులో ఉత్తీర్ణులైనవారికి మెరిట్ ఆధారంగా విజయవాడలో శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. దీంట్లో బీసీలు 66, ఎస్సీలు 20, ఎస్టీలు 14 శాతం రిజర్వేషన్ ప్రాతిపదికన అర్హులైనవారిని ఎంపిక చేస్తారు. ఎంపికైనవారు విజయవాడలోని గొల్లగూడెంలోని బీసీ భవన్‌లో ఉచిత శిక్షణ ఇస్తారన్నారు. సివిల్ సర్వీసెస్ పరీక్షకు ఉచిత కోచింగ్‌కోసం దరఖాస్తు చేసే అభ్యర్థులు తమ బయోడేటాతోపాటు పదో తరగతి, ఇంటర్, డిగ్రీ మార్కులిస్టులు, కులధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణపత్రం, ఆధార్, బ్యాంకు పాస్‌బుక్, రెండు పాస్‌పోర్టు ఫొటోలు జతపరిచి నల్లవంతెన వద్దనున్న బీసీ సంక్షేమ శాఖ కార్యాలయంలో అందించాలని చెప్పారు.



జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జేసీ నిషాంతి

నేడు జోయ్‌లుక్కాస్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

అమలాపురం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నిరుద్యోగ యువత ఉపాధి సాధనను వేగవంతం చేసేవిధంగా ప్రైవేటు రంగంలో అనుసంధానం చేయడం ద్వారా స్థిరమైన జీవనోపాధి అవకాశాలను కల్పించనున్నట్టు జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి పేర్కొన్నారు. సోమవారం స్థానిక గోదావరి భవన్‌లో ప్రముఖ ఆభరణాల సంస్థ జోయ్‌లుక్కాస్ జ్యూవెలరీ త్వరలో అమలాపురం బ్రాంచి ప్రారంభించనున్న నేపథ్యంలో వికాస ఆధ్వర్యంలో ఉద్యోగ నియామకాల ఇంటర్వ్యూలు ఈనెల 18న జరుగుతాయని జేసీ తెలిపారు. ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను ఆమె ఆవిష్కరించారు. ప్రైవేటురంగ సంస్థలతో కలిసి ఉద్యోగ మేళాలు ఏర్పాటు చేస్తున్నట్టు, వీటిని యువత సద్వినియోగం చేసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో డీఆర్వో మాధవి, వికాస జిల్లా మేనేజర్ రమేష్, డ్వామా పీడీ మధుసూదన్ పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న జాయింట్ కలెక్టర్ నిషాంతి

ఏఆర్టీ, సరోగసీ కేంద్రాల్లో పారదర్శకత తప్పనిసరి : జేసీ

అమలాపురం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పీసీ, పీఎన్డీటీ చట్టం, ఏఆర్టీ నియమాలు, సరోగసీ చట్టం అమలుపై జేసీ నిషాంతి అధ్యక్షతన సోమవారం కలెక్టరేట్‌లో సమీక్ష జరిగింది. సమావేశంలో స్కానింగ్ సెంటర్లు, ఏఆర్టీ క్లినిక్‌లు, సరోగసీ కేంద్రాల రిజిస్ట్రేషన్, పర్యవేక్షణ, రికార్డుల నిర్వహణ, ఫారం ఎఫ్, అప్‌డేట్లు, చట్ట సవరణల అంశాలపై ఆమె సమీక్షించారు. లింగ నిర్ధారణ నిషేధాన్ని బలోపేతం చేసేందుకు అవగాహన కార్యక్రమాలు మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. జిల్లాలో అనధికారిక కార్యకలాపాలు పూర్తిగా అణచివేయాలని ఆమె ఆదేశించారు.

ఎంపీపీ పీఠమెవరిదో!



వాసు



పసుమర్తి

» మండపేటలో రసవత్తరంగా రాజకీయం
» ఒప్పందం మీరడంపై ఆర్‌డీవోకు వైసీపీ ఫిర్యాదు
» ఎంపీపీ పీఠంపై రేపు బలపరీక్ష
» టీడీపీదే పీఠమంటున్న విశ్లేషకులు
» పోలీస్ బందోబస్తు ఏర్పాటు

మండపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండపేట ఎంపీపీ పదవిపై పోటీ రసవత్తరంగా మారింది.మండపేట ఎంపీపీ ఉండమట్ల శ్రీనువాస్ ఇటీవల టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వైసీపీ నుంచి గెలుపొందిన వాసు మెజార్టీ సభ్యులు బలం లేకున్నా ఆయన ఎంపీపీగా ఉన్నారని ఆయనపై అవిశ్వాసం పెడుతున్నా మని అదే పార్టీకి చెందిన వైఎస్ ఎంపీపీ పసుమర్తి నాగేశ్వరరావు సహచర ఎంపీటీసీలతో కలిసి రామచంద్రపురం ఆర్‌డీవోను కలిసి ఫిర్యాదు చేశారు. వైసీపీ హయంలో జెంటిల్ మెన్ ఒప్పందం మేరకు రెండున్నరేళ్లపాటు మాత్రమే ఎంపీపీ వాసు పదవిలో ఉండేలా అప్పటిలో వైసీపీ పెద్దల మధ్య జంటిల్‌మెన్ ఒప్పందం కుదుర్చుకున్నారు.ఎంపీపీ స్వగ్రామం కేశవరా నికి చెందిన అన్నందేవుల కృష్ణకు రెండున్నరేళ్ల పాటు ఎంపీపీ పదవి ఇచ్చేలా అప్పటిలో వైసీపీ పెద్దలు కుదుర్చుకున్న ఒప్పందం అమ లు కాలేదు. ఎన్నికల తర్వాత రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రావడం ఎంపీపీ ఉండమట్ల వాసు వైసీపీ నుంచి టీడీపీ గూటికి చేరిపోవడంతో ఆయనను వైసీపీ అధిష్ఠానం పార్టీ నుంచి సస్పెండ్ చేసింది. దీంతో ఇప్పుడు ఎంపీపీ వాసుపై వైసీపీకి చెందిన ఎంపీటీసీలు చేసిన ఫిర్యాదుపై ఈ నెల 19న మండల పరిషత్ కార్యాలయంలో జరిగే బలపరీక్షలో ఎంపీపీగా వాసు ఓటింగ్‌లో విజయం సాధిస్తారా?లేక వైసీపీ ఎంపీటీపీలు బల పరీక్షలో ఓటింగ్ ద్వారా ఎవరికి ఎంపీపీ పదవి కట్టబెడతా రనేదానిపై ఉత్కంఠం నెలకొంది.ఇప్పటికే ఎంపీపీ పీఠం టీడీపీ ఖాతాలో వేసుకునేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. కేశవరానికి చెందిన ఎంపీటీసీ అన్నందేవులు కృష్ణ లేదా ఏడిదకు చెందిన వైస్ ఎంపీపీ పసుమర్తి నాగేశ్వరరావులు ఎంపీపీ రేసులో ఉన్నారని తెలుస్తుంది. మొత్తం మీద ఈ నెల 19న ఆర్‌డీవో సమక్షంలో జరిగే బలపరీక్షలో మండలంలో బలం లేని వైసీపీ పార్టీకి భంగపాటు తప్పకపోవచ్చని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. ఎంపీపీపై బలపరీక్షకు సం బంధించి ఏర్పాట్లు పూర్తీచేశామని ఎంపీడీవో సత్యనారాయణ మూర్తి తెలిపారు.ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందో బస్తు ఏర్పాటు చేశామని తెలిపారు.

రూ.13 లక్షల పెట్టుబడులతో అభివృద్ధి పరుగులు

ఎంపీ హరీష్‌బాలయోగి

అమలాపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నాయకత్వంలో విశాఖలో జరిగిన సీఐఐ సదస్సుతో రాష్ట్రం అభివృద్ధి వైపు పరుగులు తీస్తుందని వందలాది కంపెనీలతో సుమారు రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించగలిగారని అమలాపురం ఎంపీ గంటి హరీష్‌బాలయోగి పేర్కొన్నారు. విశాఖ సీఐఐ సదస్సు మంచి ఫలితాలు ఇవ్వడంతో ఆయా సంస్థల పెట్టుబడులతో ఆంధ్ర రాష్ట్రం అభివృద్ధి పరంగా ముందుకు వెళుతుందన్నారు. భారత పరిశ్రమల సమాఖ్య సదస్సు సత్ఫలితాలు ఇవ్వడాన్ని స్వాగతిస్తూ హరీష్ విలేఖరులకు సందేశం పంపించారు. 613 ఒప్పందాల ద్వారా రూ.13.25 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని వీటి ద్వారా 16 లక్షల మందికి పైగా ఉద్యోగాలు రానున్నాయన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌తో పాటు ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఇస్తున్న సంయుక్త మద్దతుతో కార్యక్రమాలు సాధ్యమయ్యాయన్నారు. ఏపీని పెట్టుబడుల హబ్‌గా సీఎం చంద్రబాబు చేస్తున్న కృషిని ఆయన ప్రశంసించారు.



పి.గన్నవరంలో చిరుసంచి విత్తన రకం దిగుబడిని పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు నందకిషోర్, రాజశేఖర్, ఏడీఏ విజయకుమార్

దాళ్వాలో మినికిట్‌లుగా కొత్త రకాలు 1426, 3648

వ్యవసాయశాఖ ఏరువాక కేంద్రం జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ నందకిషోర్

పి.గన్నవరం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): దాళ్వాలో ఈసారి మార్టేరు ఆచార్య వ్యవసాయశాఖ విశ్వవిద్యాలయం ప్రాంతీయ పరిశోధన స్థానం నుంచి కొత్త రకాలైన 1426, ఎన్ఎల్ఆర్ 3648 రకాలను చిరుసంచి (మినికిట్‌లు) ఆసక్తిగల రైతులకు అందిస్తున్నామని జిల్లా ఏరువాక కేంద్రం కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎం.నందకిషోర్ సూచించారు. వీటిలో 1426 రకాన్ని గతేడాది రైతులకు మినికిట్‌లుగా అందించామని, ఎన్ఎల్ఆర్ మాత్రం ఇదే మొదటిసారని తెలిపారు. పి.గన్నవరంలో మినికిట్‌గా అందించిన 1443 రకం ధాన్యం దిగుబడిని రైతు నక్కా మధు ఆధ్వర్యంలో వారు పరిశీలించి అనంతరం మాట్లాడారు. ప్రస్తుతం మినికిట్‌లను పరిశీలిస్తే 30 నుంచి 35 బస్తాలకు వరకు దిగుబడి వస్తుందన్నారు. ఈసారి దళ్వాకు ఎంటీయూ-1121, 1282, 1293 రకాలను రైతులు ఎంచుకోవాలని వారు సూచించారు. 1282 సన్నరకంతోపాటు దిగుబడి బాగా వస్తుందని, అగ్గితెగులు తట్టుకుని ఎకరాకు 50 బస్తాల వరకు దిగుబడి వస్తుందన్నారు. 1293 పొడవు, సన్నరకం చౌడునేలలకు ఈరకం బాగా అనుకూలంగా ఉంటుందని, మార్కెట్‌లో మంచి గిరాకీగా ఉంటుందన్నారు.

దాళ్వాకు రైతులను సన్నద్ధం చేయాలి..

దాళ్వా సాగుకు క్షేత్రస్థాయిలో రైతులను సన్నద్ధం చేయాలని జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం ఏడీ రాజశేఖర్ తెలిపారు. పి.గన్నవరం ఆర్ఎస్‌కేలో సోమవారం సబ్‌డివిజన్ స్థాయిలో వీఏఏ, వీహెచ్ఏలకు ఏర్పాటుచేసిన రబీసాగుకు సమాయత్తం శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మొదటి పంట పూర్తయిన తరుణంలో రెండో పంటకు కార్యాచరణ ప్రారంభించేలా రైతులను సన్నద్ధం చేయాలని కోరారు. అనంతరం రెండో పంటలో నారుమళ్లు, ఎరువులు, పురుగుమందుల వాడకాలపై సిబ్బందికి ఆయన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సబ్‌డివిజన్ ఇంచార్జ్ ఏడీఏ సీహెచ్‌డీ విజయకుమార్, డీఆర్‌సీ ఏవో మనోహర్, మామిడికుదురు ఏవో ఎన్‌వీవీ సత్యనారాయణ, ఏఈవోలు సూర్యజ, జాబేజ్ శాస్త్రి పాల్గొన్నారు.

ఓం నమో శివ రుద్రాయ


తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం పుష్కరాల రేవులో దీపాలు వెలిగిస్తున్న మహిళ, చిన్నారులు




కాకినాడ జిల్లా పిఠాపురం పాదగయ క్షేత్రంలో...


డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ద్రాక్షారామలో భీమేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న అర్చకస్వాములు


కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం దుర్గాడలో రుద్రాక్షల అలంకారంలో రామలింగేశ్వరస్వామి


కాకినాడ జిల్లా సామర్లకోటలో కుమారరామ భీమేశ్వరస్వామికి అభిషేకం


కాకినాడ జిల్లా పిఠాపురం పాదగయలో దీప హారతి ఇస్తున్న మహిళలు


కాకినాడ జిల్లా పిఠాపురం పాదగయ క్షేత్రంలో హారతి ఇస్తున్న శివమాలాధారులు


డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మురమళ్లలో వీరేశ్వరస్వామికి క్షీరాభిషేకం చేస్తున్న అర్చకుడు

కార్తీక మాసం చివరి సోమవారం శైవ క్షేత్రాలకు భక్తులు పోటెత్తారు. హరహర మహాదేవ, శంభోశంకర అంటూ శివనామస్మరణ చేశారు. తెల్లవారుజామునే ఆలయాలకు వెళ్లి క్యూలైన్లలో బారులు తీరి శివుడిని దర్శించుకుని అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. రాజమహేంద్రవరం పుష్కరాల రేవులో అధిక సంఖ్యలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి గోదావరిలో దీపాలు వదిలారు. పిఠాపురం పాదగయలో కుక్కుటేశ్వరస్వామికి, సామర్లకోట, ద్రాక్షారామల్లో భీమేశ్వరస్వామికి, మురమళ్లలో వీరేశ్వరస్వామికి అర్చకులు పంచామృతాభిషేకాలు, విశేష అర్చనలు జరిపారు.


కాకినాడ జిల్లా పిఠాపురం పాదగయ క్షేత్రంలో కుక్కుటేశ్వరస్వామికి పంచామృతాభిషేకం


తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం పుష్కర ఘాట్ వద్ద గోదావరిలో కార్తీక దీపాలు వదులుతున్న మహిళలు


కలంతో నినదించారు..

- ఆయనవి అక్షరాయుధాలు
- సో.సు. మరణించినా రచనలు సజీవమే
- నేడు వజ్రాయుధ కవి ఆవంత్స సోమసుందర్ జయంతి

(పిఠాపురం, ఆంధ్రజ్యోతి)


సోమసుందర్





సోమసుందర్ రచనల్లో కొన్ని..

'ఒక వీరుడు మరణిస్తే
వేలకొలదీ ప్రభవింతురు!
ఒక నెత్తుటి బొట్టులోనే
ప్రళయాగ్నులు ప్రజ్వరిల్లు!'

అంటూ తెలంగాణ సాయుధ పోరాటం సమయంలో కలంతో నినదించిన 'వజ్రాయుధ' కవి సోమసుందర్ మన మధ్య లేకున్నా ఆయన కలం నుంచి వెలువడిన మాటల తూటాలు, అక్షరాయుధాలు నేటికీ అందరి హృదయాల్లో ప్రతిధ్వనిస్తూ సజీవంగా నిలిచాయి. రచన, విమర్శ ఏదైనా పదునైన మాటలతో ఉంటుంది. సో.సు.గా అందరూ ముద్దుగా పిలుచుకునే కవులు, విమర్శకులు, రచయితలు, ప్రముఖులు ఆయన ప్రేమపూర్వక తిట్లనే దీవెనలుగా భావించేవారు. కవి, విమర్శకుడు, సమీక్షకుడు, అనువాదకుడు, కథా రచయిత, పత్రికా సంపాదకుడు అక్షర తపస్వి డాక్టర్ ఆవంత్స సోమసుందర్ 101వ జయంతి సందర్భంగా ప్రత్యేక కథనం...

శంఖవరంలో పుట్టి పిఠాపురానికి..

1924 నవంబరు 18న కాకినాడ జిల్లా శంఖవరంలో కాశ్లూరి సూర్యప్రకాశరావు, వెంకాయమ్మ దంపతులకు సోమసుందర్ జన్మించారు. 1929లో పిఠాపురంలోని పినతల్లి ఆవంత్స చిట్టి వెంకాయమ్మ, వెంకట్రావు దత్తత తీసుకొన్నారు. దీంతో ఇంటిపేరు కాశ్లూరి మారి ఆవంత్స సోమసుందర్ అయ్యారు. దత్తత తల్లి వెంకాయ్యమ్మకు సాహిత్యంపై ఉన్న ఆసక్తితో సోమసుందర్‌కు చిన్ననాటి నుంచి కృష్ణ శతకం కంఠతా పట్టించింది. శ్రీకృష్ణలీలలు, రుక్మిణీ కల్యాణం, గజేంద్ర మోక్షం వంటి చదివించడంతో సాహిత్యంపై ఆసక్తి పెరిగింది. అదే 13వ ఏటనే కవిత్వ రచన చేసేలా ఉరికొల్పింది. ప్రాథమిక విద్య పిఠాపురంలోను, ఉన్నత విద్యను కాకినాడ పీఆర్ కళాశాలలోను చదివారు. స్వాతంత్ర్య ఉద్యమంలో సోమసుందర్ చురుకుగా పాల్గొన్నారు. 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని అరెస్టై తుని సబ్‌జైలులో శిక్ష అనుభవించారు. ఆ సమయంలోనే అభ్యుదయ కవిత్వంవైపు మళ్లారు. లాఠీచార్జిలో గాయపడిన ఈయన కలం నుంచి అక్షరాయుధాలు పుట్టుకొచ్చాయి. అక్కడే వజ్రాయుధానికి బీజంపడింది. 1944 నుంచి 48 వరకూ రాసిన కవితలను ఎంపికచేసి 1949 మార్చిలో వజ్రాయుధాన్ని ముద్రించారు. 1946 అక్టోబరు 26న దొడ్డి కొమరయ్య మరణంపై రాసిన కవితతో ఇది ప్రారంభమవుతుంది. తెలంగాణ సాయుధ పోరాటం ఇతివృత్తంగా రచించిన 'వజ్రాయుధం' సంచలనమైంది. సమాజంలో ఉద్రిక్తతలు రెచ్చగొడుతోందంటూ 1950 ఫిబ్రవరి 6న అప్పటి ఉమ్మడి మద్రాసు ప్రభుత్వం వజ్రాయుధాన్ని నిషేధించింది. 1956లో నిషేధాన్ని ఎత్తివేశారు. దీనిని హిందీ, మరాఠీ భాషల్లో అనువదించారు. ఈ పుస్తకాన్ని ఆరుసార్లు ముద్రించారు. నేటి వరకు అది సోమసుందర్ రచనల్లో ప్రత్యేకంగా నిలిచింది.

చివరి రోజు వరకూ...

ఆరోగ్యరీత్యా ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొన్నా 2016 ఆగస్టు 12న మరణించే వరకూ సోమసుందర్ కలం ఆగలేదు. రచనలు వెలువడుతూనే ఉన్నాయి. 125కి పైగా గ్రంథాలు, కథానికలు రచించారు. వీటిల్లో గోదావరి జలప్రళయం, కాగళి, వెన్నెల్లో కోనసీమ, మా ఊరుమారింది, జీవనలిపి, ఆద్రుపర్తి తదితరాలు ప్రాచుర్యం పొందాయి. ఆంధ్ర రాష్ట్ర ఉద్యమ సమయంలో రాసిన కాహళి, 1953లో గోదావరి నదికి వరదలు వచ్చిన సమయంలో రాసిన గోదావరి జలప్రళయం, వెన్నెల్లో కోనసీమ, మిణుగురులు, రక్తాక్షి, రాలిన ముత్యం, మా ఊరు మారింది, ఆంగ్లసీమలో ఆమని వీణలు, సోమసుందర్ కథలు, గురజాడ గురుత్వాకర్షణ, మేఘరంజని, విజ్ఞాన శాస్త్ర నేపథ్యంలో వెలువరించిన కవితా సంపుటి ఆ గతానికి శుభారంభం. సోషల్ రియలిజమ్ సిద్ధాంత సారాంశంతో కాలం వీలునామా, కర్నాటక, కేరళ, తమిళనాడుల్లోని యాత్రా స్థలాలు సందర్శించిన సమయంలో రాసిన అక్షయ తరంగిణి, పేదలు, అన్నార్తులు, బిచ్చగాళ్ల ఆక్రోశాలు, ఆకలిమంటలు ఇతివృత్తంగా అరిచే లోయలు, ఒక్క కొండలో వేయి శిల్పాలు, మతసామరస్యాన్ని చాటిచెబుతూ చేతవనీ, ధూపచాయ తదితర పుస్తకాలు, కవితా సంపుటిలు ప్రాచుర్యం పొందాయి. విమర్శనా గ్రంథాల్లో కృష్ణశాస్త్రి వెలిగించిన కార్తీక దీపాలు, జాతికి జ్ఞానేత్రం, కృష్ణశాస్త్రి కవితాత్మ, శేషేంద్రజాలం, గోపురదీపాలు, గురజాడ గురుత్వాకర్షణ., కాజీనజ్రుల్ ఇస్లామ్, కవితా కల్పవల్లి, ఉర్దూ సాహిత్యంలో ఉన్నత శిఖరాలు తదితర పుస్తకాలు, అనువాదంలో హెల్లీ జీవితం, సీకింగ్ పై బ్రోకెన్‌వింగ్ లాంటి గ్రంథాలు అనువదించారు. లేఖా సాహిత్యంలో, సంచారి దీపశిఖ కథా సంకలనం, సమాగమం నవలిక రచించారు. కలలు-కన్నీళ్లు పేరిట ఆత్మకథను రాసుకున్నారు. అనారోగ్యానికి గురైనా సహాయకుల సహకారంతో రచనలు కొనసాగించారు. అప్పటి రాష్ట్ర శాసనసభ డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్ షష్టిపూర్తి సందర్భంగా శ్రీశ్రీతోపాటు పలువురు కవులపై రాసిన వ్యాసాలతో కూడిన 'శరచ్చంద్రిక' పుస్తకాన్ని రచించి బహుమతిగా అందజేశారు. మిత్రులతో కలిసి 1968-1975 మధ్య కళాకేళి పత్రికను నడిపి సంపాదకత్వం వహించారు. మరణించే వరకూ తన కలం ఆగని రీతిలోనే అందరి రచనలు చదివి అభినందించేవారు. ఈ లక్షణమే ఆయనను 2001లో సోమసుందర్ లిటరరీ ట్రస్టు ఏర్పాటువైపు నడిపించింది. తన తోటి సాహితీవేత్తలను ప్రోత్సహించాలనే ట్రస్టు ప్రారంభించి ఏటా పురస్కారాలు అందజేస్తూ వచ్చారు. తనకు లభించిన పురస్కారాల ద్వారా వచ్చిన నగదు, తన పేరున ఉన్న ఆస్తులను అమ్మి ఈ ట్రస్ట్ ఏర్పాటుచేశారు. ప్రతిఏటా ఆయా రంగాల్లో ప్రముఖులకు డాక్టర్ ఆవంత్స సోమసుందర్ సాహిత్య పురస్కారం, రాజహంస కృష్ణశాస్త్రి పురస్కారం, రాంషా స్మారక విమర్శక పురస్కారం, గురజాడ కథాప్రభాస పురస్కారాలను పలువురు ప్రముఖులకు అందజేశారు.

అవార్డులు, పురస్కారాలు

సోమసుందర్ అందుకున్న అవార్డులు, పురస్కారాలు, సత్కారాలకు అంతేలేదు. 1979లో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన సోవియెట్ ల్యాండ్ నెహ్రూ బహుమతి, 2002లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ద్వారా ఆత్మగౌరవ పురస్కారం లభించింది. ఇదేగాక 2008లో ఎన్టీఆర్ జాతీయ స్మారక అవార్డు, రాజ్యలక్ష్మి ఫౌండేషన్ అవార్డు, రాజారామ్ సాహితీ పురస్కారం, కళారత్న పురస్కారం, లోక్‌నాయక్ పురస్కారం, గురజాడ 150వ జన్మదిన పురస్కారం, విశాలాంధ్ర విశిష్ట సత్కారం పొందగా, పొట్టి శ్రీరాములు తెలుగువిశ్వవిద్యాలయం ప్రతిభా పురస్కారం, గౌరవ డాక్టరేట్ పొందారు. సో.సు.గా అభిమానంగా పిలుచుకునే సోమసుందర్ అభిమానంగా తిట్లు తిడితే ఆయన అభిమానులు, స్నేహితులు, పరిచయస్తులు వాటిని దీవెనలుగా భావించేవారు. ఆ తిట్ల దీవెనలు లేకపోవడం లోటే అయినా ఆయన మాటలు తమ చెవుల్లో వినిపిస్తున్నట్టుగా ఉంటాయని వారు చెప్తున్నారు. ఎవరైనా రచన చేసి పుస్తకం పంపిస్తే దానిని చదివి వారికి అభిప్రాయం చెప్పడం ఆయన అలవాటు. సోమసుందర్ కోరిక మేరకు ఆయన పార్థివదేహాన్ని రంగరాయ వైద్య కళాశాలకు అందించారు.

నేడు సోమసుందర్ జయంతి

పిఠాపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆవంత్స సోమసుందర్ జయంతిని పట్టణంలోని సూర్యరాయ విద్యానంద గ్రంథాలయంలో మంగళవారం నిర్వహించనున్నట్టు ఆవంత్స సోమసుందర్ లిటరరీ ట్రస్టు సభ్యుడు మేకా మన్మథరావు తెలిపారు. మంగళవారం సాయంత్రం ఐదు గంటలకు ప్రారంభమయ్యే సభకు ప్రముఖ కథా రచయిత శ్రీకంఠస్ఫూర్తి హాజరవుతారు. సహృదయ మిత్ర మండలి సభ్యులు, కవులు, రచయితలు, పట్టణ ప్రముఖులు హాజరుకావాలని కోరారు.

నాకు దక్కే ప్రతి గౌరవం గిరిజనులకే...

- రామోజీ ఎక్సలెన్స్ అవార్డు వారికే అంకితం: 'నన్నయ' వీసీ ప్రసన్నశ్రీ


నన్నయ వీసీ ప్రసన్నశ్రీని సన్మానిస్తున్న విశ్వవిద్యాలయం అధికారులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది

దివాన్‌చెరువు,నవంబరు 17(ఆంధ్రజ్యోతి): తనకు దక్కే ప్రతిగౌరవం గిరిజనులకే చెందుతుందని, తనకు వచ్చిన ప్రతిష్ఠాత్మకమైన అవార్డును వారికే అంకితం చేస్తున్నానని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. కళా,సాంస్కృతిక విభాగంలో రామోజీ ఎక్సలెన్స్ అవార్డు అందుకుని సోమవారం తిరిగివచ్చారు.ఆమెకు రాజమహేంద్రవరం విమానాశ్రయం వద్ద, విశ్వవిద్యాలయం చాళుక్య ద్వారం వద్ద అధ్యాపకులు ఘనస్వాగతం పలికి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన అభినందన సభలో వీసీ మాట్లాడుతూ ఈ అవార్డు అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. గిరిజనులు అక్షరాస్యత కోసం చేస్తున్న కృషిని గుర్తించి అవార్డు ప్రదానం చేయడం హర్షణీయమన్నారు. ఈ అవార్డుతో 'నన్నయ'కు చక్కని గుర్తింపు వచ్చిందని, ఈ స్ఫూర్తితో విశ్వవిద్యాలయం అభివృద్ధికి మరింత కృషి చేస్తానని అన్నారు.

పీఏసీఎస్‌ల పర్సన్ ఇన్‌చార్జ్‌లు అందుబాటులో ఉండాలి

- డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి


వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ రామస్వామి

కాకినాడ రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పీఏసీఎస్‌ల పర్సన్ ఇన్‌చార్జిలు గ్రామాల్లోని రైతులకు అందుబాటులోఉంటూ రుణాలు మంజూరు చేయాలని, దీనికి ప్రతిఒక్కరూ సహకరించాలని, రికవరీలకు అధ్యక్షులు కృషి చేయాలని డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి సూచించారు. కాకినాడ డీసీసీబీలో సహకార శిక్షణా సంస్థ (సీటీఐ), ఆప్కాబ్ ఆధ్వర్యంలో నాబార్డు సహకారంతో జిల్లాలోని పీఏసీఎస్‌ల పర్సన్ ఇన్‌చార్జిలకు సోమవారం వర్క్‌షాప్ నిర్వహించారు. డీసీసీబీ చైర్మన్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మనకిచ్చిన పదవిని బాధ్యతగా నిర్వహిస్తే సొసైటీలను, డీసీసీబీని లాభాలబాటలో నడిపించవచ్చన్నారు. ఆప్కాబ్ ఫ్యాకల్టీ రమణారావు, సీటీఐ సత్యనారాయణరాజు... సహకార సంఘాల్లో ఎలాంటి కార్యక్రమాలు చేపట్టాలి, అవగాహన ఎలా పెంచుకోవాలి, రైతులకు సహకార సంఘాల ద్వారా ఎలా మేలు చేయాలో వివరించారు. సహకార చట్టాలు, బైలాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీసీసీబీ సీఈవో ప్రవీణ్‌కుమార్, డీపీడీఎం బాపూజీ, డీజీఎం శ్రీధర్ చౌదరి పాల్గొన్నారు.

ర్యాలి కేశవస్వామికి ఐఏఎస్ అధికారి రూ.లక్ష విరాళం

ఆత్రేయపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ర్యాలి జగన్మోహిని కేశవస్వామి ఆలయానికి సోమవారం విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజనల్ డెవలెప్‌మెంట్ అథారిటీ కమిషనరు ఎన్.తేజభరత్ విచ్చేశారు. స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అభివృద్ధి పనులకు రూ.లక్ష విరాళం సమర్పించారు. ఆయనకు ఈవో బీహెచ్‌వీ రమణమూర్తి స్వామివారి చిత్రపటం, శేషవస్త్రం అందజేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు.


దాతకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఈవో





మంచు కురిసిందే మహాబాగుందే..

ఇటీవల చలి పెరిగింది. దీంతో తెల్లవారుజామున పొగమంచు విపరీతంగా కురుస్తోంది. అల్లూరి జిల్లా ఎటపాక మండలం గౌరిదేవిపేట-గన్నవరం గ్రామాల మధ్యలో పంట పొలాలపై పొగమంచు దట్టంగా పట్టి మంచు తెరల సోయగం కనిపించింది. అందమైన ఈ దృశ్యాలను 'ఆంధ్రజ్యోతి' కెమెరా క్లిక్ మనిపించిందిలా.. - ఎటపాక (ఆంధ్రజ్యోతి)

తెలుగు విశ్వ విద్యాలయంలో తొలిసారిగా సెమినార్



డిసెంబర్ 20లోపు నిర్వహిస్తాం

వీసీ ఆచార్య డి.మునిరత్నం నాయుడు

రాజమహేంద్రవరం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం తెలుగు విశ్వ విద్యాలయంలో తొలిసారిగా డిజిటల్ యుగంలో సామాజిక అభివృద్ధి తెలుగు భాష పాత్ర - సమస్యల పరిష్కారం అనే అంశంపై డిసెంబర్ 20లోపు సెమినార్ నిర్వహించనున్నట్టు వైస్ చాన్సలర్ ఆచార్య డి.మునిరత్నం నాయుడు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన వివరాలు వెల్లడించారు. డిసెంబర్ చివరి వారంలో 3 రోజుల పాటు కూచిపూడి నృత్యంపై ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. 15 బృందాలకు చెందిన సుమారు 100 నుంచి 150 మంది కళాకారులు పాల్గొంటారన్నారు. జనవరిలో త్యాగరాజ సంగీత ఉత్సవాలు, ఫిబ్రవరిలో అన్నమయ్యపై సదస్సు నిర్వహిస్తామని చెప్పారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి హైదరాబాద్‌లో తెలుగు విశ్వవిద్యాలయం 1985 డిసెంబర్ 2ను ఏర్పాటు చేయగా ఈ ఏడాది డిసెంబర్ 2కి 40 ఏళ్లు అవుతుందన్నారు. 40వ వార్షికోత్సవం రాజమహేంద్రవరంలోనే నిర్వహిస్తామన్నారు. క్యాంపస్‌లోని ప్రస్తుతం ఉన్న భవనాలకు మరమ్మతులు, రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసినట్టు ఆయన చెప్పారు.

వివిధ కోర్సులకు 161 దరఖాస్తులు

ఈ విద్యాసంవత్సరం నిమిత్తం తెలుగు విశ్వ విద్యాలయం ఇచ్చిన నోటిఫికేషన్‌కు స్పందించి వివిధ కోర్సులకు 161 మంది దరఖాస్తు చేశారని తెలిపారు. కూచిపూడిలో పలు కోర్సులకు 133 దరఖాస్తులు వచ్చాయి. వర్శిటీలో ఎంఏ డ్యాన్స్, యక్ష గానం, సర్టిఫికెట్ డిప్లమో, సాత్వికాభినయం వంటి కోర్సులు ఉన్నాయి. శ్రీశైలం పీఠంలో ఎంఏ హిస్టరీ, పీహెచ్‌డీ కోర్సులకు 25 దరఖాస్తులు వచ్చాయి. ఎంఏ తెలుగుకు మూడు దరఖాస్తులే వచ్చినట్టు వీసీ ఆచార్య డి.మునిరత్నం నాయుడు తెలిపారు. ఈ కోర్సుల్లో చేరడానికి దరఖాస్తుల స్వీకరణ గడువు 20 వరకూ పొడిగించామని, అపరాధ రుసుం రూ.200తో దరఖాస్తులు చేసుకోవచ్చని ఆయన తెలిపారు.

వారి నియామకమెప్పుడు?

తెలుగువిశ్వ విద్యాలయం వైస్ చాన్సలర్‌ను నియమించిన ప్రభుత్వం రిజిస్ట్రార్‌ను ఇంకా నియమించలేదు. ఫైనాన్స్ ఆఫీసర్‌ను నియమించలేదు. వారిద్దరి నియామకం పూర్తయితేనే ఇక్కడ పనులు, నియామకాలు వేగంగా జరుగుతాయి. బహుశా వచ్చేవారంలోపు వారి నియామకాలు ఉండవచ్చనే అంచనా ఉంది.

భక్తులతో పోటెత్తిన సత్యదేవుడి సన్నిధి



రత్నగిరి రావిచెట్టు వద్ద కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

▸ కార్తీకమాస చివరి సోమవారం 9167 వ్రతాలు

▸ రూ.85 లక్షల ఆదాయం

అన్నవరం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధి చివరి కార్తీక సోమవారం భక్తులతో పోటెత్తింది. రద్దీని దృష్టిలో ఉంచుకుని అధికారులు రెండుగంటల నుంచి వ్రతాలు, దర్శనాలు ప్రారంభించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా ఆలయ చైర్మన్ రోహిత్, ఈవో సుబ్బారావు పర్యవేక్షించారు. స్వామివారి వ్రతాలు, దర్శనానంతరం భక్తులు రత్నగిరి రావిచెట్టు వద్ద కార్తీక దీపాలు వెలిగించారు. చివరి సోమవారం సుమారు 9167 వ్రతాలు జరగగా, వివిధ విభాగాల ద్వారా సుమారు రూ.85 లక్షల ఆదాయం లభించింది. ఇదిలాఉండగా సోమవారంతో ఈ ఏడాది కార్తీకమాస పర్వదినాలు ముగిశాయి. అయితే ఈ ఏడాది కార్తీకమాస రద్దీని దృష్టిలో పెట్టుకుని పర్యవేక్షణకు ముగ్గురు ప్రత్యేక అధికారులను దేవదాయ కమిషనర్ నియమించారు. ఆలయ చైర్మన్ రోహిత్ పర్వదినాల్లో రద్దీ నియంత్రణ, అడ్డదారుల్లో ఎవరూ వెళ్లకుండా పర్యవేక్షణ చేయడంతో పలువురి నుంచి ప్రశంసలు పొందారు.

దుళ్ళలో దొంగతనం

● 20 గ్రాముల బంగారం, 5.530 కిలోల వెండి ఆభరణాలు మాయం

● వస్త్రాల మధ్య భద్రంగా ఉన్న 40 కాసుల బంగారు ఆభరణాలు



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

కడియం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): తాళం వేసి ఉన్న ఇంటిలో దొంగలు ప్రవేశించి బంగారం, వెండి వస్తువులతో పాటు నగదును సైతం అపహరించుకుపోయిన సంఘటన తూర్పుగోదావరి జిల్లా కడియం మండలం దుళ్ళలో జరిగింది. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... దుళ్ళ చెరువుగట్టు మెయిన్‌రోడ్డును ఆనుకుని ఉన్న ముసునూరి వెంకటరత్నం ఇంటిలో ఈ దొంగతనం జరిగింది. వారు ఈనెల 9న అమలాపురంలోని తమ రెండో కుమార్తె ఇంటికి వెళ్లారు. తాళం వేసి ఉన్న ఇంటిని గమనించిన దొంగలు వాటిని బద్దలు గొట్టి ఇంటిలోకి ప్రవేశించి వస్తువులను దొంగిలించుకుపోయారు. ఇంటితాళాలు పగులగొట్టి ఉన్న విషయాన్ని స్థానికులు అమలాపురంలో ఉన్న వెంకటరత్నంకు తెలిపారు. అతడు వచ్చి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ ఏ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. 20 గ్రాముల 2 బంగారు ఉంగరాలతో పాటు 5 కిలోల 530 గ్రాముల వెండి, రూ.1,75,000 నగదు పోయినట్టు గుర్తించారు. మరో 40 కాసుల బంగారు ఆభరణాలు వస్త్రాల మధ్య ఉండటం వల్ల దొంగలకు చిక్కలేదు. దీంతో బాధితులకు కొంత ఉపశమనం కలిగింది. సీఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో డాగ్, క్లూస్‌టీమ్ తనిఖీలు నిర్వహించాయి. కార్యక్రమంలో ఎస్ఐ దుర్గాప్రసాద్, ట్రైనీ ఎస్ఐ మురళీకృష్ణ తదితరులు ఉన్నారు.

సత్రంగదుల ధరల పెంపు

దేవదాయ కమిషనర్ ఆదేశాలు

డిసెంబరు 1 నుంచి అమలుచేసే ఆలోచనలో అధికారులు



అన్నవరం దేవస్థానంలో సీఆర్వో కార్యాలయం

అన్నవరం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి సన్నిధిలో సత్రంగదుల పెంపునకు దేవదాయ కమిషనర్ రామచంద్రమోహన్ ఆదేశాలిచ్చారు. శానిటరీ నిర్వహణ ఖర్చులు పెరగడం, సత్రంగదుల రీమోడలైజేషన్, నూతనంగా దుప్పట్లు, దిండ్లు రగ్గులు కొనుగోలు చేయడం వంటి సౌకర్యాల కల్పనతో వ్యయం ఆధారంగా గదుల అద్దె పెంపు ప్రతిపాదనలకు దేవదాయ కమిషనర్ ఆమోదం తెలిపారు. ప్రస్తుతం పాత, కొత్త సెంటినరీ కాటేజీల ధర రూ.500 ఉండగా దానిని రూ.700కి పెంచారు. హరిహరసదన్ కాటేజీ అద్దె ప్రస్తుతం రూ.950 ఉండగా దానిని జీఎస్టీతో కలిపి రూ.1500కు పెంచారు. ప్రకాష్‌సదన్ కాటేజీ అద్దె ప్రస్తుతం రూ.999 ఉండగా దానిని రూ.1200 అద్దె 5 శాతం జీఎస్టీతో కలిపి వసూలు చేయనున్నారు. పెంచిన ధరలను డిసెంబరు 1 నుంచి అమలు చేయాలని అధికారులు ఆలోచన చేస్తున్నారు.

వైద్యుడిపై దోపిడీ దొంగల దౌర్జన్యం

పోలీసుల రాకతో పరారీ

కాకినాడ క్రైం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో పోస్ట్‌గ్రాడ్యుయేషన్ చేస్తున్న ఓ వైద్యుడిపై దోపిడీ దొంగలు దౌర్జన్యానికి పాల్పడిన సంఘటన ఆదివారం అర్థరాత్రి జరిగింది. వివరాలిలా ఉన్నాయి. కోల్‌కతాకు చెందిన డాక్టర్ రవి జైస్వాల్ కాకినాడ ఆర్ఎంసీలో ఈఎన్‌టి పీజీ మొదటి సంవత్సరం చదువుతూ స్థానిక సుబ్బయ్య హోటల్ సమీపంలో రూమ్‌లో అద్దెకు ఉంటున్నాడు. జీజీహెచ్‌లో ఆదివారం రాత్రి వైద్య సేవలందించి అర్థరాత్రి 1 గంట సమయంలో డ్యూటీ ముగించుకుని ఇంటికి వెళ్తుండగా స్థానిక 3 లైట్ల జంక్షన్ వద్ద ముగ్గురు జైస్వాల్ వాహనాన్ని ఆపారు. ఐడీకార్డు చూపెట్టమన్నారు. చూపించిన వెంటనే వెళ్లిపోమన్నారు. మళ్లీ వెంబడించారు. రూమ్‌కు వస్తారని భయపడిన వైద్యుడు నేరుగా రైల్వేస్టేషన్ దారిలో వెళ్తుండగా వారు వాహనాలతో అడ్డగించారు. మళ్లీ ఐడీకార్డు చూపించమని అడగ్గా జైస్వాల్ ఐడీ కార్డు తీసేటప్పటికి లాగేసుకున్నారు. వైద్యుడి జేబులో రూ.2500 లాగేసుకున్నారు. వారిలో ఒక దొంగ వైద్యుడి వాహనంపై ఎక్కి 3లైట్ల జంక్షన్ వరకు తీసుకొచ్చి బండిని పార్క్ చేశారు. ఇద్దరు దొంగలు అక్కడ ఉండి, ఒక దొంగ వైద్యుడిని తన వాహనం ఎక్కించుకుని తన ఏటీఎం కార్డులో ఉన్న నగదును డ్రా చేయించేందుకు ప్రయత్నించిన ఫలితం లేకపోయింది. ఈలోపు జైస్వాల్ తన సహ వైద్యులకు తాను ప్రమాదంలో ఉన్నానని లోకేషన్ షేర్ చేశాడు. అనంతరం అపోలో హాస్పటల్ సమీపంలో ఉన్న ఏటీఎం సెంటర్‌కు తీసుకెళ్లగా అప్పటికే సమాచారం అందు కున్న బీట్ కానిస్టేబుళ్లు తారసపడేసరికి ఆ దొంగ అక్కడి నుంచి పరారయ్యాడు. పోలీసులను తీసుకుని జైస్వాల్ తన వాహనం ఆపిన చోటుకు తీసుకెళ్లేసరికి అక్కడ ఉన్న ఇద్దరు దొంగలు కూడా పరారయ్యారు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

గుండెపోటుతో మల్లేపల్లి సర్పంచ్ మృతి



బలిరెడ్డి వరలక్ష్మి (ఫైల్)

గండేపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి మండలంలో మల్లేపల్లి గ్రామ సర్పంచ్ బలిరెడ్డి వరలక్ష్మి (62) సోమవారం సాయంత్రం మృతిచెందారు. ఆమెకు ఆదివారం గుండెపోటు రావడంతో రాజమండ్రి బొల్లినేని ఆస్పత్రికి కుటుంబసభ్యులు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్టు స్థానికులు తెలిపారు. బలిరెడ్డి వరలక్ష్మి మల్లేపల్లి గ్రామ సర్పంచ్‌గా రెండోసారి సేవలందించారు. గ్రామంలో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పనులు విజయవంతంగా చేపట్టి ప్రజల ఆదరాభిమానాలు పొందారు. వరలక్ష్మి భర్త గంగారాజు గతంలో గ్రామ సర్పంచ్‌గా ఐదేళ్లు పనిచేశారు. సర్పంచ్ వరలక్ష్మి మృతి పట్ల గ్రామస్తులు, అధికారులు, నాయకులు సంతాపం తెలిపారు.

చోరీ కేసులో వ్యక్తి అరెస్ట్

బంగారం, వెండి ఆభరణాల స్వాధీనం

కొవ్వూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఇంటి తాళాలు బద్దలు కొట్టి దొంగతనానికి పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసినట్టు కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులోని క్రిస్టియన్‌పేట లూథరన్ చర్చి వెనుక నివాసం ఉంటున్న తుంపిరి రామారావు ఆదివారం మధ్యాహ్నం ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లాడు. సాయంత్రం ఇంటికి వచ్చేసరికి బీరువాలో పెట్టిన రూ.3 లక్షల విలువైన బంగారం, వెండి వస్తువులు చోరీ అయినట్టు గుర్తించి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. దొంగతనానికి పాల్పడిన రాజమహేంద్రవరం నెహ్రూనగర్ దుర్గగుడి ప్రాంతానికి చెందిన (ప్రస్తుతం కోరుకొండ బుచ్చంపేటలో నివాసం ఉంటున్న) కుందుర్తి శ్రీకాంత్‌ను సోమవారం అరెస్ట్ చేశారు. అతడి నుంచి రామారావు ఇంటిలో దొంగతనం చేసిన (రూ.2.50 లక్షల విలువైన వస్తువులు) 1 బంగారపు నల్లపూసల తాడు, 3 బంగారపు ఉంగరాలు, 4జతల వెండి పట్టీలు, 4 వెండి ఉంగరాలు, 2 వెండి బ్రాస్‌లెట్‌లు స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా గతంలో రాజమహేంద్రవరం త్రీటౌన్ ఏరియాలో 528/2025 చోరీ కేసుకు సంబంధించి బంగారపు తాడు, కడియం పోలీస్టేషన్ పరిధిలోని వేమగిరిలో 288/2025 కేసుకు సంబంధించి రూ.5,340 స్వాధీనం చేసుకున్నట్టు సీఐ తెలిపారు. కేసును ఛేదించిన సిబ్బందిని తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి.నరసింహకిషోర్, డీఎస్పీ జి.దేవకుమార్ అభినందించారు.

బాలికపై బాలుడు లైంగిక దాడి

పోక్సో కేసు నమోదు

కపిలేశ్వరపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం నల్లూరులో 11ఏళ్ల బాలుడు 8 ఏళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆదివారం జరిగిన ఈ ఘటనపై సోమవారం అంగర పోలీసులకు ఫిర్యాదు అందింది. బాలిక అమ్మమ్మ ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు అంగర ఎస్ఐ జి.హరీష్‌కుమార్ తెలిపారు.

ఆటోను పడగొట్టిన ఆబోతు

తీవ్రగాయాలతో వ్యక్తి మృతి

అల్లవరం వద్ద ఘటన

అల్లవరం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కుటుంబ సభ్యులతో దేవాలయాలకు వెళ్లి తిరిగి వస్తుండగా మార్గంమధ్యలో ఆటోను ఆబోతు పడగొట్టిన ప్రమాదంలో వ్యక్తి మృత్యువాత పడ్డాడు. వివరాల ప్రకారం.. పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంకు చెందిన దంగేటి శ్రీనివాసరావుతో పాటు అతడి భార్య, చిన్న కుమార్తె, మరో ఇద్దరు ఆటోలో సోమవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా లోని అయినవిల్లి వినాయకాలయం, కుండలేశ్వరంలో పలు ఆలయాల దర్శనానికి వెళ్లారు. తర్వాత ఓడలరేవు బీచ్ చూసి తిరిగి వస్తుండగా అల్లవరం వద్ద ఓ బోతు రెచ్చిపోయి ఆటోను పడగొట్టింది. ఆటో పల్టీ కొట్టి అందులోని వారంతా పడిపోయారు. శ్రీనివాసరావుకు తీవ్ర గాయాలయ్యాయి. అల్లవరం సామాజిక ఆసుపత్రికి తరలించి వైద్య సేవలందిస్తుండగా అప్పటికే మరణించినట్టు నిర్ధారించారు. ఘటనపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ సంపత్‌కుమార్ చెప్పారు.

వ్యవసాయాభివృద్ధికి కృషి చేయాలి

డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరక్టర్ శ్రీనివాసరావు

9 జిల్లాలకు చెందిన సెర్ప్ సీఆర్పీలకు సామర్లకోటలో శిక్షణ తరగతులు



సామర్లకోటలో ప్రసంగిస్తున్న డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు

సామర్లకోట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వానికి, రైతులకు మధ్య సెర్ప్ సీఆర్పీలు వ్యవసాయాభివృద్ధికి వారధిలా పనిచేయాలని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ జి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. కాకినాడ జిల్లా సామర్లకోటలోని విస్తరణ శిక్షణ కేంద్ర ఆవరణలో శ్రీకాకుళం నుంచి తూర్పు గోదావరి వరకు తొమ్మిది జిల్లాలకు చెందిన సెర్ప్ సీఆర్పీలకు మూడు రోజుల శిక్షణ తరగతులను సోమవారం ఆయన ప్రారంభించారు. విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ కేఎన్వీ ప్రసాదరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పీడీ శ్రీనివా సరావు మాట్లాడుతూ డ్వాక్రా సంఘాల సభ్యుల్లో మంచి చురుకైన పనితీరు కలిగిన కొందరి మహిళలను ఎంపిక చేసి వ్యవసాయా ఉత్పత్తి దారుల సంఘాలతో సమన్వయం చేసుకోవడం ద్వారా వ్యవసాయాభివృద్ధికి సీఆర్పీలు పాటుపడాలన్న ప్రధాన ఉద్దేశంతోనే ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈటీసీ ప్రిన్సిపాల్ ప్రసాదరావు మాట్లాడుతూ ఇక్కడ సీఆర్పీలు పొందిన శిక్షణను క్షేత్రస్థాయిలో సత్ఫలితాలను రాబట్టేందుకు రైతుల్లో మార్పులు తీసుకురావాలన్నారు. ప్రభుత్వం ఈ శిక్షణలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నందున నూరుశాతం ఫలితాలను సమీకృత వ్యవసాయాభివృద్ధి ద్వారా సాధించాలని సూచించారు. ఇక్కడ శిక్షణ పొం దిన ప్రతీ ముగ్గురు సీఆర్పీలు గ్రామాల్లో 100 మంది రైతులను సమీకరించి అభివృద్ధి ఫలాలను వివరించాలని, కౌలు రైతులను భాగస్వాములను చేయాలన్నారు. తరగతుల ప్రారంభానికి ముందుగా పది జిల్లాల శిక్షణార్థులకు ఈటీసీ సౌజన్యంతో సమకూర్చిన స్టీల్ వాటర్‌బాటిళ్లను పీడీ అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ జీ.రమణ, డీడీవోలు డి.శ్రీనివాసరావు, ఎస్ఎస్.శర్మ, డీపీఎం (ఎల్‌హెచ్) బాబూరావు, జేపీఈ వెంకటేశ్వరరావు, సామర్లకోట ఏపీఎం (ఎల్‌హెచ్) జగదీశ్వరి, అనిల్‌కుమార్ ఉన్నారు.

సోదరి ఇంటికి వెళ్లొస్తుండగా..

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి



ఆంజనేయులు (ఫైల్)

చాగల్లు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా బ్రాహ్మణగూడెంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. ఎస్ఐ కే.నరేంద్ర తెలిపిన వివరాల ప్రకారం.. చాగల్లు మండలంలోని కలవలపల్లికి చెందిన ఇరగవరపు ఆంజనేయులు (23) బైక్‌పై తన సోదరి ఇంటికి విజ్జేశ్వరం వెళ్లి తిరిగి వస్తుండగా రాత్రి సమయంలో నిడదవోలు మండలం బ్రాహ్మణగూడెం శివారు కలవలపల్లికి వెళ్లే రోడ్డులో కల్యాణ మండపానికి సమీపంలో ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఆంజనేయులు తలకు బలమైనగాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. గుర్తుతెలియని వాహనం డ్రైవర్ నిర్లక్ష్యంగా, అతివేగంతో నడిపి బైక్‌ను ఢీకొనడం వల్ల ఈ ప్రమాదం జరిగినట్టు స్థానికులు తెలిపారు. వ్యవసాయ కూలీగా పనిచేసుకుంటూ జీవనం సాగించే ఆంజనేయులుకు వివాహం కాలేదు. అతడి సోదరుడు ఇరగవరపు సత్యన్నారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ కే.నరేంద్ర పేర్కొన్నారు.

ఏం జరిగిందో... ఏంటో?

● ఇద్దరు పిల్లలతో తండ్రి అదృశ్యం

● దిండి - చించినాడ వంతెనపై వస్తువులు

● గోదారిలో దూకారేమోనని అనుమానాలు

● ఆందోళనలో కుటుంబసభ్యులు



అదృశ్యమైన మోహిత్, జాహ్నవి (ఫైల్)





దిండి-చించినాడ వంతెన బైక్, ముగ్గురు విడిచిన చెప్పులు

మలికిపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం లక్కవరానికి చెందిన శిరిగినీడి దుర్గాప్రసాద్ (38) తన ఇద్దరు పిల్లలతో అదృశ్యమయ్యాడు. భార్యతో ఉన్న విభేదాలతో దుర్గాప్రసాద్ తన కుమారుడు మోహిత్ (14), కుమార్తె జాహ్నవి(9)లను వెంటపెట్టుకుని గ్లామర్ బైక్‌పై సోమవారం సాయంత్రం 6.30 గంటల ప్రాంతంలో బయటకు వెళ్లాడు. దిండి- చించినాడ వంతెనపై బైక్, జోళ్లు, సెల్‌ఫోన్, ఆధార్‌కార్డులను వదిలాడు. వారు గోదావరిలోకి దూకి ఉంటారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వంతెనపై వదిలిన వస్తువులను స్థానికులు చూసి బంధువులకు సమాచారం ఇవ్వడంతో దిండి - చించినాడ వంతెన వద్దకు గ్రామస్తులు, కుటుంబసభ్యులు వెళ్లారు. అయితే వంతెన యలమంచిలి పోలీస్ స్టేషన్ పరిధిలోకి రావడంతో అక్కడ ఫిర్యాదు చేశారు. మలికిపురం, యలమంచిలి పోలీసులు సీసీ కెమెరాల ద్వారా పశ్చిమగోదావరి జిల్లా వైపు ఎవరైనా వెళ్లారా అని ఆరా తీస్తున్నారు. దుర్గాప్రసాద్ ఫైనాన్స్ వ్యాపారం చేస్తుంటాడని స్థానికులు తెలిపారు. తండ్రి, ఇద్దరు పిల్లలు అదృశ్యం కావడంతో ఎక్కడున్నారో.. వారికి ఏం జరిగిందో తెలియక కుటుంబసభ్యులు ఆవేదన చెందుతున్నారు.

అమలాపురం

• అమలాపురం • ముమ్మిడివరం • పి.గన్నవరం • రాజోలు



ప్రత్యేక అలంకరణ వ్యాఘ్రేశ్వరంలోని వ్యాఘ్రేశ్వరస్వామివారు



ముమ్మిడివరం ఉమాసూరేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

కైలాసవాసా శిరసా నమామి

• శివనామస్మరణతో మార్మోగిన శైవ క్షేత్రాలు • తెల్లవారుజాము నుంచే పోటెత్తిన భక్తజనం • ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు

అంబాజీపేట, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం ఆఖరి సోమవారం సందర్భంగా శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. మండలంలోని ఏకాదశ రుద్రులను దర్శించుకునేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన భక్తులతో రద్దీ నెలకొంది. విశాఖపట్నం, కొవ్వూరు, రావులపాలెం, తాడేపల్లిగూడెంలతో పాటు పలు దూర ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 2వేల మందికిపైగా భక్తజనం ఏకాదశ రుద్రుల దర్శనానికి తరలివచ్చారు. అంబాజీపేట మండలంలోని గంగలకుర్రు అగ్రహారం, గంగలకుర్రు, మొసలపల్లి, కె.పెదపూడి, ఇరుసుమండ, పుల్లేటికుర్రు, వ్యాఘ్రేశ్వరం, వక్కలంక, ముక్కామల, అమలాపురం మండలం పాలగుమ్మి, అయినవిల్లి మండలం నేదునూరు గ్రామాల్లో ఉన్న శివుడిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఒకే రోజున ఏకాదశ రుద్రులను దర్శించుకోవడం సంతోషంగా ఉందని దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులన్నారు. దర్శనానికి వచ్చే భక్తులకు ఆయా గ్రామాల్లో ప్రసాదాలు, బాదంపాలను అందించారు. కార్తీకమాసం సందర్భంగా మండలంలోని పలు శివాలయాల్లో లక్షబిల్వార్చన నిర్వహించారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

అల్లవరం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం చివరి సోమవారం కావడంతో ఆయా శైవక్షేత్రాలు శివనామస్మరణలతో మార్మోగాయి. ప్రసిద్ధి పొందిన ఎస్.రామేశ్వరం పార్వతీ రామేశ్వరాలయంలో చైర్మన్ అంగాని రామారావు ఆధ్వర్యంలో, లక్ష్మణేశ్వరం, బోడసకుర్రు గౌతమేశ్వర ఆలయాల్లో వేకువజాము నుంచే అభిషేకాలు, కుంకుమ పూజలు జరిగాయి. కొమరగిరిపట్నం, బెండమూర్లంక, దేవగుప్తం, గోడి, గోడిలంక, అల్లవరం, తాడికోన, యెంట్రుకోన తదితర గ్రామాల్లోని ఆయా శివాలయాల్లో అభిషేకాలు, జ్యోతిర్లింగార్చనలు నిర్వహించారు. ఆయా శైవ క్షేత్రాల చుట్టూ 108 ప్రదక్షిణలకు యువతీ, యువకులు పోటీపడ్డారు.

ఉదయం నుంచే బారులుతీరిన భక్తులు

ముమ్మిడివరం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం చివరి సోమవారాన్ని పురస్కరించుకుని మండలంలోని శైవక్షేత్రాలు శివనామస్మరణతో మార్మోగాయి. ఉదయాన్నే భక్తులు ఆయా శివాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపించారు. ముమ్మిడివరంలోని శ్రీఉమా సూరేశ్వరస్వామి, క్రాపచింతలపూడి ఉమావల్లభేశ్వరస్వామి, కొమానపల్లి పార్వతీ సమేత చోడేశ్వర, లోకేశ్వరస్వామి, అయినాపురం ఉమాసోమేశ్వరస్వామి, అన్నంపల్లి పార్వతీ గౌతమేశ్వరస్వామి, కొత్తలంక ఉమాభోగేశ్వరస్వామి, ఠాణేలంక ఉమాసోమేశ్వరస్వామి ఆలయాలతో పలు ఆయా గ్రామాల్లోని శైవక్షేత్రాలు భక్తులతో పోటెత్తాయి. భక్తులు పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు, లక్షపత్రిపూజ, రుద్రాభిషేకం వంటి పూజలు నిర్వహించారు. ముమ్మిడివరం నగర పంచాయతీ శ్రీహరిసాకేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో అరుణాచలేశ్వరున్ని దర్శించుకుని గిరి ప్రదక్షిణ నిర్వహించి స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆయా శివాలయాల్లో దీపోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో జరిపారు.

ఆలయంలో భక్తుల కోలాహలం

మామిడికుదురు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం చివరి సోమవారం కావడంతో మండలంలోని శైవక్షేత్రాలు శివనామస్మరణతో మార్మోగాయి. మండలంలోని ఆయా శివాలయాల్లో భక్తుల కోలాహలం కనపడింది. తెల్లవారుజామునే ఆయా శైవక్షేత్రాల్లో భక్తులు అభిషేకాలు చేయించుకున్నారు. ఈదరాడ, పాశర్లపూడి గ్రామాల్లోని శివాలయాల్లో లక్ష బిల్వార్చన నిర్వహించారు. ఈదరాడలోని శ్రీఉమాసోమేశ్వరస్వామి, శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయాల్లో విఘ్నేశ్వరపూజ, సోమేశ్వరునికి పంచామృతాలతో అభిషేకం, ఉమాదేవికి లక్ష కుంకుమార్చన తదితర పూజలను జరిపారు. పాశర్లపూడిలోని చెన్నమల్లేశ్వరశ్వరస్వామి ఆలయంలో గుత్తుల శ్రీనివాసరావు దంపతులు లక్ష బిల్వార్చన చేశారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొన్నారు.

కుండలేశ్వరానికి పోటెత్తిన భక్తులు

కాట్రేనికోన, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కార్తీక సోమవారం ఆఖరి వారం సందర్భంగా కుండలేశ్వరానికి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. స్థానిక వృద్ధ గౌతమిలో స్నానాలు చేసిన అనంతరం గోదావరి మాత గుడి వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కుండలేశ్వరస్వామిని భక్తజనం దర్శించుకున్నారు. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. అన్నసమారాధనలో 15,000 మంది పాల్గొన్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఆలయ ప్రాంగణంలోని శ్రీరుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి, కనకదుర్గ, సుబ్రహ్మణ్యేశ్వరుడు, ఆంజనేయ స్వామిని భక్తులు దర్శించుకున్నారు. ఆయా ఆలయాల వద్ద ఎస్ఐ అవినాష్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో దీపారాధనలు

అంతర్వేది, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కార్తీక సోమవారం ఆఖరి వారం సందర్భంగా అంతర్వేది నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో వేకువజాము నుంచే భక్తులు స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం నందీశ్వరుని వద్ద భక్తులు దీపారాధనలు చేశారు. అంతర్వేది లక్ష్మీనరసింహ యువత ఆధ్వర్యంలో భక్తులకు అల్పాహారం అందించారు. లక్ష్మీనరసింహుని ఆలయంలో భక్తులు దర్శనానికి బారులుతీరారు. రామేశ్వరం, మోరి, అంతర్వేదిపాలెం, అంతర్వేది కొత్తవంతెన వద్ద శివాలయాల్లో భక్తులు పంచామృతాలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం సమయంలో ఆలయాల వద్ద దీపాలంకరణ నిర్వహించారు.

యానాంలో కిటకిటలాడిన ఆలయాలు

యానాం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం ఆఖరి సోమవారాన్ని పురస్కరించుకుని యానాంలోని శైవక్షేత్రాలు కిటకిటలాడాయి. స్థానిక పుష్కరఘాట్ వద్ద భక్తజనం కార్తీక దీపాలు వెలిగించి గోదావరిలో వదిలారు. స్థానిక శివంబాత్ భక్తులతో కిటకిటలాడింది. భక్తులు దీపదానం చేసి మొక్కులు చెల్లించారు. అభయ ఆంజేయస్వామికి, రావిచెట్టు వద్ద భక్తులు దీపాలు వెలిగించి పూజలు చేశారు. ఫెర్రీ రోడ్డు కార్తీక శోభతో కళకళలాడింది. స్థానిక శివాలయంలో ఉన్న రాజరాజేశ్వరస్వామికి తెల్లవారుజాము నుంచే భక్తులు పూజలు చేశారు. కార్తీకమాసం నాల్గవ సోమవారం కావడంతో యానాంలోని ఆయా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

వైభవంగా లక్ష బిల్వార్చన

ఉప్పలగుప్తం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): గోపవరం ఉమారాజలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం లక్ష బిల్వార్చన నిర్వహించారు. ఆలయ అర్చకుడు వెలవలపల్లి అబ్బన్నశర్మ ఆధ్వర్యంలో పలువురు శైవాగమ పండితుల పర్యవేక్షణలో రుద్రాభిషేకం, జ్యోతిలింగార్చన జరిగింది. సామూహిక కుంకుమార్చనలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

లక్ష రుద్రాక్ష పూజ

అమలాపురం రూరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): నడిపూడి శ్రీఅన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాస సోమవారాన్ని పురస్కరించుకుని లక్ష రుద్రాక్ష పూజతో పాటు, లక్ష బిల్వార్చన నిర్వహించారు. అధికారి వెంకటేశ్వరరావు-భవానీ దంపతులు నేపాల్ నుంచి తెప్పించిన రుద్రాక్షలతో శైవాగమ పండితుడు వెలవెలపల్లి చంద్రశేఖరశాస్త్రి బ్రహ్మత్వంలో 15 మంది రుత్వికులతో ఆలయ ప్రధానార్చకుడు పండుస్వామి ఆధ్వర్యంలో రుద్రాక్ష పూజ నిర్వహించారు. అమ్మవారికి కుంకుమార్చన, సహస్ర లింగార్చన, శాంతి కల్యాణం జరిపించారు. కార్యక్రమంలో ఎ.సత్యనారాయణ, ఎ.శ్రీరామ్‌మోహనరావు, ఎ.బాబ్జి-జయవెంకటలక్ష్మి, కె.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



కాట్రేనికోనలోని శ్రీపార్వతీ కుండలేశ్వరస్వామి



యానాంలోని పుష్కర్‌ఘాట్ వద్ద దీపాలు వదులుతున్న దృశ్యం

వీరేశ్వరస్వామి ఆలయంలో

ఐ.పోలవరం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మురమళ్ళ వీరేశ్వరస్వామి ఆలయం సోమవారం భక్తులతో కిటకిటలాడింది. వేకువజాము నుంచి భక్తులు గోదావరి నదిలో స్నానాలాచరించి వీరేశ్వరస్వామిని దర్శించుకున్నారు. భక్తులకు నలమాటి అవినాష్‌చౌదరి, జితేష్‌చౌదరి సహకారంతో అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ దాట్ల రామకృష్ణంరాజు, అసిస్టెంట్ కమీషనర్ వి.సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు. మండలంలోని ఐ.పోలవరం, కేశనకుర్రుపాలెం, ఎదుర్లంక, టి.కొత్తపల్లి గ్రామాల్లోని శివాలయాలు కిటకిటలాడాయి.

ఆలయాల్లో భక్తుల రద్దీ

అయినవిల్లి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం చివరి సోమవారాన్ని పురస్కరించుకుని అయినవిల్లి సిద్ధివినాయక ఆలయం, అన్నపూర్ణాదేవి సమేత వీరేశ్వరస్వామి, ముక్తేశ్వరంలో ముక్తికాంత క్షణముక్తీశ్వరస్వామి, రాజరాజేశ్వరి సమేత ముక్తేశ్వరాలయాలు భక్తులతో కిక్కిరిశాయి. ఉదయం నుంచే భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. అయినవిల్లిలోని ఆయా రహదారులు భక్తుల రాకతో కిటకిటలాడాయి. భక్తులకు అసౌకర్యం కలగకుండా సహాయ కమిషనర్, ఈవో ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో సిబ్బంది భక్తులకు తగిన సేవలు అందించారు.

డిగ్రీ కాలేజీలో స్పాట్ అడ్మిషన్లు

ముమ్మిడివరం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ, బీకాం, బీఏ కోర్సుల్లో మిగిలిన ఉన్న సీట్లకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ప్రభాకర్ తెలిపారు. ఈ నెల 20న డిగ్రీ కళాశాలలో బీఎస్సీ బోటనీ (ఆనర్స్), బీఎస్సీ కంప్యూటర్స్ (ఆనర్స్), బీఎస్సీ కెమిస్ట్రీ (ఆనర్స్), బీకాం కంప్యూటర్స్ అప్లికేషన్స్ (ఆనర్స్), బీఏ హిస్టరీ (ఆనర్స్) కోర్సుల్లో మిగిలిన సీట్లు భర్తీ చేయనున్నట్టు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఆధార్‌కార్డు, సర్టిఫికెట్లతో 20న కళాశాలకు హాజరు కావాలన్నారు. వివరాలకు 99087 38840లో సంప్రదించాలని ప్రిన్సిపాల్ ప్రభాకర్ తెలిపారు.

రేషన్ దుకాణంపై సివిల్ సప్లయి డైరెక్టర్ తనిఖీ

ముమ్మిడివరం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరంలోని బియ్యం దుకాణంలో రేషన్ బియ్యం ఉన్నట్టు సివిల్ సప్లయి డైరెక్టర్ కదలి ఈశ్వరి అనుమానం వ్యక్తం చేయడంతో షాపు యజమానికి, ఆమెకు మధ్య వాగ్వివాదం చోటు చేసుకున్నట్టు సమాచారం. దీంతో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు యర్రంశెట్టి వెంకటేశ్వరరావు, పోలీసులు అక్కడకు చేరుకున్నారు. దుకాణంలో రేషన్ షాపు బియ్యం లేవని, సివిల్ సప్లయి అధికారులు లేకుండా షాపులను తనిఖీ చేయడం ఎంత వరకు సబబు అని చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు సివిల్ సప్లయి డైరెక్టర్‌ను, ఆమె కూడా వచ్చిన అసిస్టెంట్‌ను నిలదీశారు. సివిల్ సప్లయి డిప్యూటీ తహశీల్దార్ ఎస్.భారతిని అమలాపురం నుంచి రప్పించి మరోసారి దుకాణం గోదామును పరిశీలించారు. దుకాణంలో సివిల్ సప్లయి బియ్యం లేనట్టు ఆమె నిర్ధారించడంతో సివిల్ సప్లయి డైరెక్టర్ అక్కడి నుంచి వెళ్లిపోయారు.

ఏపీ పెట్టుబడుల దిశను మార్చిన సీఐఐ సమ్మిట్

అమలాపురం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): పెట్టుబడుల హబ్‌గా ఏపీని మార్చేందుకు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ ఎంతో శ్రమిస్తున్నారని టీడీపీ మీడియా కోఆర్డినేటర్ బోళ్ల సతీష్‌బాబు తెలిపారు. విశాఖలో నిర్వహించిన సీఐఐ భాగస్వామ్య సదస్సు దీనికి వేదికగా నిలిచిందన్నారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ అనుమతులు వేగంగా ఇవ్వడం వల్ల పరిశ్రమల ఆకర్షణకు ప్రధానంగా నిలిచిందని, ఇది శుభ పరిణామమని సతీష్ పేర్కొన్నారు.

సీఐఐ విజయవంతంపై హర్షం

పి.గన్నవరం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) రాబోయే రోజుల్లో ఏపీ పరిశ్రమల హబ్‌గా మారబోతుందని నియోజకవర్గ కో-కన్వీనర్లు మోకా ఆనందసాగర్, దాసరి వీరవెంకట సత్యనారాయణ అభిప్రాయపడ్డారు. ఏపీలో జగన్‌కు రాజకీయ భవిష్యత్ లేదని వారు విమర్శించారు. పి.గన్నవరం పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. విశాఖలో జరిగిన సీఐఐ విజయవంతంపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి లోకేష్‌లకు ధన్యవాదాలు తెలుపుతున్నట్లు తెలిపారు. అనంతరం పార్టీ కార్యాలయానికి పలువురు నేతలు పర్నిచర్ అందించారు. కార్యక్రమంలో చిట్టూరి శ్రీనివాస్, రాష్ట్ర పరిశ్రమలశాఖ డైరెక్టర్ అంబటి భూలక్ష్మి, చొల్లంగి సత్యనారాయణమూర్తి, గుమ్మడి వెంకటేశ్వరావు, ఆరుమిల్లి సాయిబాబు, పత్తిపాటి వెంకన్నబాబు, పులపర్తి సూజాత, అరిగెల బలరామమూర్తి, శేరు శ్రీనుబాబు, పెచ్చెటి వెర్రియ్య, కుంపట్ల నాయుడు, పైడి బుజ్జి, తోట రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

అమలాపురం రూరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): అమలాపురం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు స్కూలు గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కాగా ప్రధానోపాధ్యాయుడు బీహెచ్ వీఎస్ రామకృష్ణ అధ్యక్షతన సోమవారం అభినందన సభ నిర్వహించారు. పాఠశాలకు చెందిన ఎ.శిరీష అండర్-17 బాస్కెట్‌బాల్ విభాగంలో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ నెల 21న నూజివీడులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో శిరీష పాల్గొంటుందన్నారు. అండర్-14 విభాగంలో పి.వినయ్ కృష్ణ రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడని, ఈ నెల 20న చిత్తూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని రామకృష్ణ తెలిపారు. వీరిని వ్యాయామ ఉపాధ్యాయులు కె.గణేశ్వరరావు, టి.రవిచంద్రమౌళి, పి.విష్ణు ప్రసాద్ తదితరులు అభినందించారు.



ఆర్టీసీ ఏడీసీని సత్కరిస్తున్న గ్రామస్తులు

కొవ్వూరు ఆర్టీసీ ఏడీసీకి సత్కారం

అంబాజీపేట, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు దైవ దర్శనం కల్పించడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని కొవ్వూరు ఆర్టీసీ అధికారి పి.సూర్యచంద్రరావు అన్నారు. ఏకాదశ రుద్రుల దర్శనానికి వచ్చిన ఆయనకు గంగలకుర్రు అగ్రహారంలో పలువురు సత్కరించారు. ఒకే రోజు 11 రుద్రుల దర్శనం కలగడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఏకాదశ రుద్రులను హైకోర్టు రిటైర్డ్ జడ్జి సీహెచ్ సోమయాజులు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆయా గ్రామాల్లో ప్రత్యేక పూజల అనంతరం సత్కరించారు.

స్వామివారి కల్యాణోత్సవాలకు

ముందస్తు అభివృద్ధి ప్రణాళిక

ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

అంతర్వేది, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): అంతర్వేదిలో స్వామివారి కల్యాణోత్సవాల ప్రారంభానికి రెండు నెలల ముందే అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్నామని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. నియోజకవర్గంలో కొత్తగా చేపట్టబోయే రోడ్లకు శంకుస్థాపన చేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా అంతర్వేది దేవస్థానం రథం రోడ్డు నిర్మాణాలకు ఆయన శ్రీకారం చుట్టారు. రాజవారి వీధి నుంచి 16 స్తంభాల మండపం వరకు రింగ్ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దేవ పలు అంశాలపై మాట్లాడారు. కార్యక్రమంలో డెల్టా ప్రాజెక్టు చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ గుబ్బల ఫణికుమార్, రాజోలు డెల్టా ప్రాజెక్టు చైర్మన్ పినిశెట్టి బుజ్జి, ముప్పర్తి నాని, వీరా మల్లిబాబు, రావూరి నాగు, పోతురాజు కృష్ణ, ఎంపీటీసీ బైరా నాగరాజు, సర్పంచ్ జాన్‌బాబు, పి.సురేష్, యెనుముల బుజ్జి, వనమాలి మూలాస్వామి, కూటమి శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

కాల్వల సుందరీకరణకు పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే : రాజోలు నియోజకవర్గంలోని కాల్వల సుందరీకరణ పనులకు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ సోమవారం శంకుస్థాపనలు చేశారు. ప్రధాన రహదారుల వెంబడి ఉన్న ప్రధాన కాల్వలకు ఇరువైపులా సుందరీకరణగా మార్చేందుకు మొదటి దశలో టేకిశెట్టిపాలెం నుంచి సఖినేటిపల్లి లంక వరకు కాల్వల సుందరీకరణ చేపట్టాలని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో గుబ్బల ఫణికుమార్, ఎం.సత్యవాణి, ఎన్డీఏ కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



అంతర్వేదిలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

నియోజకవర్గంలోని రహదారుల అభివృద్ధికి పెద్దపీట

రాజోలు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలోని రోడ్లు అభివృద్ధి చెందుతున్నాయని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. చింతపల్లిలో పోతుమట్ల, పిప్పళ్లవారిమెరక, కూనవరంలను కలుపుతూ నిర్మించనున్న రహదారులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దేవ పలు అంశాలపై మాట్లాడారు. కార్యక్రమంలో గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, దంతులూరి చంటిబాబు, సూరిశెట్టి శ్రీనివాస్, వైస్ ఎంపీపీ యింటిపల్లి ఆనందరాజు, కడలి మోహన్, పిప్పళ్ల రాము తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌కు అర్జీల వెల్లువ

అమలాపురం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు అర్జీదారులు వెల్లువెత్తారు. కోనసీమలోని పలు లంక గ్రామాలు నదీ కోతకు గురై భూములు, కొబ్బరిచెట్లు నదీ గర్భంలో కలిసిపోతున్నాయని, వాటి నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతూ బీజేపీ జిల్లాశాఖ అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో అర్జీ అందించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా, వివిధ విభాగాల నాయకులు అయ్యల భాషా, కోటిపల్లి సాయిరామ్, షాదిర్, పావులూరి వెంకట్, సంసాని రత్నకుమార్ తదితరులు ఉన్నారు.

పరిహారం అందలేదు: మొంథా తుఫాన్ సమయంలో పునరావాస కేంద్రాల్లో ఉన్నప్పటికీ తమకు ప్రభుత్వ పరంగా ఆర్థికసాయం అందలేదని విలస గ్రామ పరిధిలోని రావిగుంటచెరువు ప్రాంత వాసులు అర్జీ అందించారు. ఈ విషయాన్ని ముమ్మిడివరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ దృష్టికి సైతం తీసుకువెళ్లామన్నారు. అర్జీ అందించిన వారిలో శీలం సత్యవతి, దేవదాసు శాంతమ్మ, డి.ధనలక్ష్మి, దూనబోయిన నాగరత్నం తదితరులు ఉన్నారు.

తీసుకోని రుణాలు మంజూరు చేశామంటే ఎలా : గోడిలంక పంచాయతీ పరిధిలో గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 70 మంది పేదలు గృహ నిర్మాణ రుణాలు తీసుకోలేదు. గృహ నిర్మాణశాఖ అధికారుల లెక్కల్లో వారికి రుణాలు మంజూరు చేసినట్టు చూపించి అవినీతికి పాల్పడినట్టు సమాచార హక్కు చట్టం ద్వారా తెలుసుకున్నామన్నారు. దీనిపై విచారణ జరిపి అర్హులైన పేదలకు గృహనిర్మాణ రుణాలు మంజూరు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం, కుల వివక్ష పోరాట సమితి ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి అర్జీ అందించారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు కారెం వెంకటేశ్వరరావు, బొమ్మి శ్రీనివాసరావు, పోతుల వెంకటేష్, నాగాబత్తుల బాలయోగి, నవరపు చిరంజీవి, కమల, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాల కోసం..

అమలాపురం టౌన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): అమలాపురం బండివారిపేటకు చెందిన మహ్మద్ హబీబీరెహ్మాన్ సోమవారం కలెక్టరేట్‌లో అర్జీ అందించేందుకు టోపీతో వచ్చారు. ప్రభుత్వ పరంగా తనకు రావాల్సిన పథకాల కోసం జనన ధ్రువీకరణ పత్రం అవసరం అయిందన్నారు. స్కూలు రికార్డు ప్రకారం 1961 ఉందని, ఆధార్‌కార్డులో 1973గా నమోదైందన్నారు. అప్పట్లో తాను 9వ తరగతి వరకు అమలాపురంలో చదువుకున్న పాఠశాల నుంచి డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికేట్ తీసుకు వచ్చి అధికారులకు అర్జీ అందించినట్టు తెలిపారు.

విశ్రాంత ఉద్యోగుల హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాలు

అమలాపురం టౌన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఉద్యోగుల హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాల తీరును నిరసిస్తూ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ (ఏపీఆర్‌పీఏ) ఆధ్వర్యంలో సోమవారం గడియారస్తంభం సెంటర్‌లో పెన్షనర్ల విద్రోహ దినం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన నిరసనకు జిల్లాశాఖ అధ్యక్షుడు కడలి సత్యనారాయణ, కార్యదర్శి జి.గోపాలకృష్ణ నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు ఎం.వెంకటేశ్వరరావు, గౌరవాధ్యక్షుడు శ్రీరామమూర్తి, కార్యదర్శి వి.బాలాజీరావు తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ జోలికి పోవద్దు

అల్లవరం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ జోలికి పోవద్దని అల్లవరం ఎస్ఐ బి.సంపత్‌కుమార్ సూచించారు. బోడసకుర్రు శిష్టా అప్పన్న మెమోరియల్ జిల్లాపరిషత్ హైస్కూలులో హెచ్ఎం బండారు సుభాషిణి అధ్యక్షతన 8, 9, 10 తరగతుల విద్యార్థులతో జరిగిన సమావేశంలో ఎస్ఐ మాట్లాడారు. గంజాయి, గుట్కా, మద్యపానాల జోలికి వెళ్లవద్దని సూచించారు. గ్రామ సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి, తెలుగు యువత మండల అధ్యక్షుడు ముత్యాల బాబీ, రొక్కాల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ములికిపల్లి-గోగన్నమఠం రోడ్డుకు మరమ్మతులు

రాజోలు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ములికిపల్లి నుంచి పొన్నమండ మీదుగా గోగన్నమఠం వరకు రోడ్డు అధ్వాన్నంగా తయారైంది. ఈ రోడ్డు మీదుగా ప్రయాణించాలంటేనే వాహనదారులు, ప్రయాణికులు బెంబేలెత్తిపోతున్నారు. ఈ నేపథ్యంలో గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు చైర్మన్ గుబ్బల శ్రీనివాస్ తన సొంత నిధులతో ములికిపల్లి నుంచి పొన్నమండ మీదుగా గోగన్నమఠం వరకు సోమవారం మరమ్మతు పనులు చేపట్టారు. సొంత నిధులతో రోడ్డు మరమ్మతులు చేయిస్తున్న డెల్టా చైర్మన్ శ్రీనివాస్‌ను గ్రామస్తులు, వాహనదారులు అభినందించారు. కార్యక్రమంలో దాకే ఏడుకొండలు, కడలి మోహన్, మోకా ఏడుకొండలు, కాంట్రేగుల మణిబాబు తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి పంపిణీ

ఐ.పోలవరం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో పలు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారికి సీఎం రిలీఫ్ ఫండ్ ఆర్థికంగా ఆదుకుంటుందని ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అన్నారు. నియోజకవర్గ పరిధిలో 47 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.36లక్షల ఆర్థికసహాయం చెక్కులను సోమవారం మురమళ్ళ క్యాంపు కార్యాలయం వద్ద ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, ఏఎంసీ చైర్మన్ ఓగూరి భాగ్యశ్రీ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు గుత్తుల సాయి, నాగిడి నాగేశ్వరరావు, నాయకులు గొలకోటి దొరబాబు, మందాల గంగసూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన మాజీ క్రికెటర్ వెంకటపతిరాజు: మాజీ క్రికెటర్ సాగిరాజు వెంకటపతి రాజు సోమవారం ముమ్మిడివరం ఎమ్మెల్యేను కలిశారు. మురమళ్ళ క్యాంపు కార్యాలయంలోమ ఆయనతో ఆయన కొద్దిసేపు ముచ్చటించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ తన స్వస్థలం పశ్చిమ గోదావరి జిల్లా అయినా చిన్నప్పటి నుంచి హైదరాబాదులో చదువుకుంటూ స్థిరపడ్డానన్నారు. 1991 నుంచి 2002 వరకు భారత క్రికెట్ జట్టులో కొనసాగానన్నారు. 2007లో ధోని సారథ్యంలో టి-20 వరల్డ్ కప్ సాధించిన సమయంలో తాను ఇండియన్ క్రికెట్ టీమ్ సెలక్టర్‌గా ఉన్నట్టు గుర్తు చేశారు.



ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబును కలిసిన మాజీ క్రికెటర్ వెంకటపతిరాజు

పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం కృషి

ఎమ్మెల్యే ఆనందరావు



పాడి రైతులకు పశుదాణా పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు, మెట్ల రమణబాబు

అల్లవరం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): పాడి పరిశ్రమ అభివృద్ధికి, పాడి రైతుల ఆర్థిక ఎదుగుదలకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తున్నదని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. పాడి రైతులు ప్రభుత్వ సంక్షేమాలను సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, ఎంఆర్ఎం సొసైటీ చైర్మన్ మెట్ల రమణబాబు అన్నారు. కొమరగిరిపట్నం ఎంఆర్ఎం సొసైటీ, అల్లవరం సొసైటీల వద్ద చైర్మన్లు మెట్ల రమణబాబు, కంకిపాటి గోపి అధ్యక్షతన ఎమ్మెల్యే ఆనందరావు పాడి రైతులకు పశువుల దాణా పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్షత్రియ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ దెందుకూరి సత్తిబాబురాజు, డీసీ చైర్మన్ దాట్ల గోపీరాజు, శెట్టిబలిజ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కడలి వెంకటేశ్వరరావు, వేగిరాజు వెంకట్రాజు, సీఈవోలు కొమ్మూరి సత్తిబాబు, గంగాధర్ తదితరులతో పాటు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్‌కు ప్రత్యేక చట్టం

ముమ్మిడివరం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): సీనియర్ సిజిజన్ల కోసం 2007లో చట్టం తీసుకొచ్చారని ముమ్మిడివరం మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ రహ్మతుల్లా పేర్కొన్నారు. ముమ్మిడివరంలోని కోర్టు ఆవరణలో సీనియర్ సిటిజన్ల గురించి సోమవారం నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వడ్డి నాగేశ్వరరావు, న్యాయవాదులు ఎంటీ ప్రసాదరావు, ఎస్ఐ డి.జ్వాలాసాగర్‌లతో పాటు న్యాయవాదులు, సీనియర్ సిటిజన్లు పాల్గొన్నారు.

క్విజ్ పోటీల్లో జడ్పీ విద్యార్థుల ప్రతిభ

అయినవిల్లి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): అమలాపురానికి చెందిన ది ఫైన్ స్వచ్ఛంద సంస్థ అమలాపురం ఆధ్వర్యంలో జిల్లాస్థాయిలో జరిగిన క్విజ్, వక్తృత్వ పోటీల్లో ముక్తేశ్వరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. క్విజ్ పోటీల్లో ఎం. సాయిఆశ్రిత, బి.యశ్విన్, వై.జానకీరామ్, ఎస్.పుష్కరవిగ్నేష్, ఎస్.చరణ్ ప్రథమస్థానంలో, వక్తృత్వంలో ఎం.సాయిఆశ్రిత ద్వితీయ స్థానంలో నిలిచారు. విజేతలకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. వీరిని గైడ్ టీచర్ గుబ్బల సాయిశ్రీనివాస్, మండల విద్యాశాఖాధికారులు మెల్లం శ్రీనివాసరావు, పెచ్చెట్టి శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నిమ్మకాయల గణేశ్వరరావు, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ యడ్ల లక్ష్మీదుర్గ, సర్పంచ్ కె.శాంతావతి, ఉపాధ్యాయులు ఎ.శ్రీనివాసరావు, టి.శ్రీనివాసరావు, మోడల్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నేరేడుమిల్లి సత్యనారాయణ తదితరులు అభినందించారు.

కవి సమ్మేళనం

ఉప్పలగుప్తం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): హృదయ స్పందనే నిజమైన కవిత్వమని కవి నల్లా నరసింహమూర్తి అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం భీమనపల్లి గ్రంథాలయంలో కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సం దర్భంగా నరసింహమూర్తి, బీవీవీ సత్యనారాయణ, అద్దంకి అమరేశ్వరరావు, కడలి సత్యనారాయణ, కామన మధు, జ్యోతి కవితాగానం చేశారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించగా, గ్రంథాలయ భవన స్థలదాత కుటుంబ సభ్యుడు శిరంగు నాగకుమార్ విజేతలకు బహుమతి ప్రదానం చేశారు.

అనువంశిక ధర్మకర్త లక్ష్మీనారాయణకు అభినందనలు

మామిడికుదురు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ దేవస్థానం అనువంశిక ధర్మకర్తగా ప్రమాణ స్వీకారం చేసిన మొల్లేటి లక్ష్మీనారాయణ (చక్రి)ని శెట్టిబలిజ మండల నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో మండల శెట్టిబలిజ సంఘ అధ్యక్షుడు కాంద్రేగుల శ్రీనివాస్, కడలి నూకరాజు, బొక్కా వీరవెంకటేశ్వరరావు, యాండ్ర వీరబాబు, అప్పారి వెంకటేశ్వరరావు, వాసంశెట్టి రామకృష్ణ, వీఎస్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

మండపేట

• కొత్తపేట • మండపేట • రామచంద్రపురం

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

మండపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడలో జరిగిన కుంగ్‌ఫూ కరాటే పోటీల్లో మండపేట పట్టణానికి చెందిన విద్యార్థులు పాల్గొని తమ సత్తా చాటారు. గోల్డెన్ షోటో ఖాన్ కరాటే అకాడమీ సారథ్యంలో జరిగిన పోటీల్లో మండపేట పట్టణంలోని న్యూడ్రాగన్ చైనిస్‌కుంగ్‌ఫూ కరాటే గ్రాండ్‌మాస్టర్ పిట్టా రాజబాబు వద్ద శిక్షణ పొందిన 50 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వైట్‌బెల్ట్ నుంచి బ్లూ బెల్ట్ వరకు నేర్చుకున్న విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. అలాగే 30 మంది విద్యార్థులు వివిధ విభాగాల్లో విజేతలుగా నిలవగా, మరో 18 మంది కూడా వివిధ క్యాటగిరీల్లో బహుమతులు పొందారని ఆయన చెప్పారు.

చెట్ల నరికివేతపై మాజీ ఎంపీపీ ఫిర్యాదు


గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేస్తున్న బాబ్జీ

మండపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో విలువైన ఔషధ గుణాలు కలిగిన మర్రి, రావిచెట్లను అక్రమార్కులు అడ్డగోలుగా నరికేసి పర్యావరణానికి విఘాతం కలిగిస్తున్నారని మాజీ ఎంపీపీ అడబాల బాబ్జీ తెలిపారు. సోమవారం మండపేటలో జరిగిన గ్రీవెన్స్‌లో అధికారులకు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ భూములు, కాల్వ, చెరువుగట్లపై సహజ సిద్ధంగా పెరిగిన భారీవృక్షాలు గుట్టుచప్పుడు కాకుండా అడవి దొంగలు చెట్లను నరికేసి ఆనవాళ్లు కూడా లేకుండా చేస్తున్నారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే గ్రామంలోని ప్రధాన కూడళ్ల వద్ద వున్న సీసీ కెమెరాల్లో చెట్ల తరలింపు దృశ్యాలు రికార్డు అయ్యాయని, వాటిని అధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు


కపిలేశ్వరపురంలో పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

కపిలేశ్వరపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కపిలేశ్వరపురం శాఖా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా 4వ రోజు సోమవారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. జూనియర్స్ విభాగంలో అమ్మ ప్రేమ అంశంపై, సీనియర్స్ విభాగంలో ప్లాస్టిక్ నిషేధం అంశంపై నిర్వహించినట్టు గ్రంథాలయాధికారిణి డీ. శివకుమారి తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విజేతలకు గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు రోజున బహుమతులు ప్రదానం చేస్తామని ఆమె చెప్పారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ సాకా శ్రీనివాస్, డ్రాయింగ్ టీచర్ అబ్బులు, రిటైర్డ్ టీచర్ చిట్టూరి సత్యనారాయణ, గ్రంథాలయ పాఠకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలకు ప్రధాని ఫొటోలు అందజేత


సోమేశ్వరంలో మోదీ ఫొటోలు అందజేస్తున్న కూటమి నాయకులు

రాయవరం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమేశ్వరంలో భారతీయ జనతాపార్టీ ఆధ్వర్యంలో ఆ పార్టీ మండలాధ్యక్షుడు శాకా దుర్గా శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం ప్రధాని నరేంద్రమోదీ ఫొటోలను అందజేశారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం, సచివాలయం, సహకార సంఘం కార్యాలయాలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు చాట్రాతి జానకి రాంబాబు, కొత్తపల్లి శ్రీదేవి, సహకార సంఘం అధ్యక్షుడు వైట్ల రాంబాబు, బీజేపీ సీనియర్ నాయకులు కోన సత్యనారాయణ, వల్లభనేని రవీంద్రబాబు, చిరట్ల సుబ్బారావు, చింతా తమ్మిరెడ్డి, నిమ్మకాయల సాయిరాం ప్రసాద్, టీడీపీ అమలాపురం పార్లమెంట్ ఉపాధ్యక్షుడు వైఆర్కే పరమహంస, శాకా శ్రీనివాస్, జనసేన నేతలు శాకా నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

నేడు సర్పంచ్, ఉప సర్పంచ్‌లకు శిక్షణ

కపిలేశ్వరపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఉదయం పది గంటలకు మండలంలోని సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, కార్యదర్శులకు క్లీన్ అండ్ గ్రీన్‌పై శిక్షణ నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో ఎస్. భానూజీరావు ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన కోరారు.


కోటిపల్లిలో అన్నప్రసాద వితరణ చేస్తున్న కూటమి నాయకులు


వల్లూరులో ప్రత్యేక అలంకరణలో శ్రీ పార్వతీ సమేత అగస్త్యేశ్వరస్వామి

కిటకిటలాడిన శివాలయాలు

● కార్తీకమాసం నాల్గో సోమవారం కావడంతో మహిళల ప్రత్యేక పూజలు ● ఏర్పాట్లు చేసిన ఆలయ కమిటీలు

మండపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం నాల్గో సోమవారం కావటంతో మండపేట పట్టణంతోపాటు మండలంలోని శైవ క్షేత్రాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. ముఖ్యంగా పట్టణంలోని అగస్త్యేశ్వరస్వామివారి ఆలయంతోపాటు ఏడిద సంగమేశ్వర స్వామివారి ఆలయాలకు వేకువజాము నుంచే భక్తులు పోటెత్తారు. అలాగే ద్వారపూడి ఆంధ్ర శబరిమలై అయ్యప్పస్వామి వారి ఆలయానికి కూడా భక్తులు పెద్దసంఖ్యలో వచ్చారు. అలాగే మండలంలోని జెడ్.మేడపాడు, ఏడిద సంఘమేశ్వరం, తదితర గ్రామాల్లో కార్తీక దీపోత్సవాన్ని నిర్వహించారు, అలాగే జెడ్.మేడపాడులో వేంచేసియున్న శ్రీదేవి భూదేవి సమేత కేశవస్వామివారి ఆలయంలో అఖండ దీపారాధన చేశారు.

కె.గంగవరం: పవిత్ర కార్తీకమాసం నాలుగో సోమవారం కోటిపల్లి పుణ్యక్షేత్రం భక్తుల శివనామస్మరణలతో హోరెత్తింది. వేకువజామునుంచే భక్తులు గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీ ఛాయా సోమేశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. మహిళలు ప్రత్యేక పూజలు చేస్తూ కార్తీక దీపాలు వెలగించారు. రాత్రికి స్వామి వారికి లక్షబిల్వార్చన చేశారు. ఆలయం ప్రాంగణంలో డొక్కాడి భాస్కరరావు సహకారంతో అన్నప్రసాద వితరణ చేశారు. కూటమి నాయకులు వప్పుల మసేను వెంకన్న(రేవు శ్రీను), కర్రి చిట్టిబాబు, పెమ్మాడి సత్తిబాబు, వెంటూరు వీర్రాఘవులు చౌదరి, గొడవర్తి రామకృష్ణ, చీకట్ల సోమేష్, తదితరులు పాల్గొన్నారు. అలాగే యండగండి, పామర్రు, అముజూరు, పానింగపల్లి, సత్యవాడ, గంగవరం, కుందూరు, దంగేరు, మసకపల్లి, భట్లపాలిక, యర్రపోతవరం, బాలాంత్రం, పేకూరులో ఉదయం నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. కుందూరు శివాలయం వద్ద కార్తీక వన సమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

కపిలేశ్వరపురం: మండలంలోని పలు గ్రామాల్లో గల శివాలయాలు సోమవారం శివనామస్మరణతో మార్మోగాయి. మండల కేంద్రంలోని శ్రీ దుర్గాపార్వతి సమేత పాపవినాశేశ్వర స్వామి ఆలయంలో కార్తీకమాసం ఆఖరి సోమవారం కావడంతో వివిధ గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ అర్చకులు ఆధ్వర్యంలో భక్తులచే స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. విద్యార్థులు ఆలయం చుట్టూ 108 ప్రదక్షిణలు చేశారు. ఆలయం వద్ద భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు చేసినట్టు ఆలయ చైర్మన్ పితాని సూర్యచంద్రరావు తెలిపారు. గ్రామస్థులతో పాటు వివిధ గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

రాయవరం: మండలంలోని ప్రముఖ శైవక్షేత్రాలు భక్తుల శివనామ స్మరణతో మార్మోగాయి. కార్తీకమాసం చివరి సోమవారం కావడంతో సోమేశ్వరంలోని సోమేశ్వరం బాలత్రిపురసుందరి సమేత సోమేశ్వరస్వామి, వెంటూరు ఉమా సోమేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సోమేశ్వరంలో పురోహితులు పరిటాల సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ, అర్చనలు, లక్ష బిల్వార్చన, అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. వెంటూరు సోమేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు మద్దిరాల సాయికిరణ్ రాజా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వేదపండితులు ఇంద్రగంటి విశ్వనాథశర్మ, పెండాల పవన్ కుమార్ సంతోష్, మైలవరపు సూర్యనారాయణ, దేవులపల్లి శ్రీరామ్, తదితరులు పాల్గొని స్వామివారికి అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు చేశారు. రాయవరం పార్వతీసమేత రాజరాజేశ్వరస్వామి ఆలయంలో విలపర్తి ఫణిధర్, శశిధర్‌శర్మ ఆధ్వర్యంలో, రాయవరం అన్న పూర్ణసమేత కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయం, చెల్లూరు అగస్త్యేశ్వరస్వామి, లొల్ల ఉమా రామలింగేశ్వర స్వామి, వి.సావరం మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి, పసలపూడి భీమేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. వేకువజాము నుంచే భక్తులు కాలువల్లో పుణ్యస్నానాలు ఆచరించారు. టీడీపీ అమలాపురం పార్లమెంట్ ఉపాధ్యక్షుడు వైఆర్కే పరమహంస, ఈవో ఎం.శోభారాణి, రావుల రామకృష్ణ, వెంటూరులో కమిటీ సభ్యులు ముత్యాల వీరబాబు, రిమ్మలపూడి దొరబాబు, మాటూరి వెంకన్నబాబు, వల్లూరు శ్రీను, గుత్తుల శ్రీను, అన్నవరం, చుండ్రు రవికుమార్ పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో వెంటూరు సోమేశ్వరస్వామి, సోమేశ్వరం సోమేశ్వరస్వామి

ఏపీలో పెట్టుబడులపై ఎమ్మెల్యే వేగుళ్ల హర్షం



మండపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): విశాఖలో జరిగిన సీఐఐ భాగస్వామ్య సదస్సులో ఏపీలో పలు కంపెనీలు భారీ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావడంపై ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు సోమవారం ఆయన మండపేటలో విలేఖరులతో మాట్లాడుతూ ఇందులో సీఎం చంద్ర బాబు, మంత్రి నారా లోకేష్ చొరవ ఎంతో ఉందన్నారు. దాదాపుగా రూ.13 లక్షల కోట్ల మేర పెట్టుబడులు రావటం ఆనందదాయకమన్నారు.

తడి, పొడిచెత్తను వేరు చేయండి : కమిషనర్


తడి, పొడిచెత్తపై వార్డు ప్రజలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మండపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజలంతా తడి, పొడిచెత్తను వేరు చేసి పారిశుధ్య కార్మికులకు అందజేయాలని మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు సూచించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ వార్డుల్లో మెప్మా సిబ్బంది సహకారంతో తడి, పొడిచెత్త వేరు చేసే దానిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్టు వెల్లడించారు. చెత్తను ఎరువుగా మార్చి ఇంటిలో పెంచుకునే మొక్కలకు వాడుకోవాలని తెలిపారు. అలాగే ప్లాస్టిక్ కవర్లకు బదులుగా గుడ్డ, చేతి సంచులను ప్రజలు మార్కెట్‌కు వెళ్లినప్పుడు తీసుకొని వెళ్లాలన్నారు.

మూడు చక్రాల మోటార్ సైకిళ్ల కోసం దరఖాస్తు చేసుకోండి

మండపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): అర్హత కలిగిన దివ్యాంగులు మూడు చక్రాల మోటార్ సైకిళ్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు రాష్ట్రప్రభుత్వం అవకాశం కల్పిస్తున్నట్టు ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన మాట్లాడుతూ 70 శాతం వైకల్యం కలిగినవారు తమ దరఖాస్తులను ఈనెల 25వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో సమర్పించుకోవాలని సూచించారు.

ఓం నమః శివాయ!


ఆలమూరులో విక్రమభట్టీశ్వరస్వామి

» శివనామస్మరణతో మార్మోగిన శైవక్షేత్రాలు
» కార్తీక సోమవారం పూజలు
» స్వామి దర్శనానికి పోటెత్తిన భక్తులు

ఆలమూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా శైవక్షేత్రాలు శివనామస్మరణతో మార్మోగాయి.ఆలమూరులోని విక్రమ భట్టీశ్వరస్వామి ఆలయం తెల్లవారుజాము నుంచి భక్తుల రాకతో కిటకిటలాడింది. ఆలయార్చకులు స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేకపూజలు నిర్వహించారు. అలాగే మూలస్థానం మూలేశ్వరస్వామి, జొన్నాడ కాశీ అన్నపూర్ణ విశ్వేశ్వరస్వామి, చింతలూరు పృథ్వీశ్వరస్వామి, పెనికేరు ఇష్టకాంతేశ్వరస్వామి, మడికి, నర్సిపూడి సోమేశ్వరస్వామి ఆలయాలతోపాటు పెదపళ్ల, పినపళ్ల, సంధిపూడి, కలవచర్ల, నవాబుపేట, మోదుకూరు, గుమ్మిలేరు, చొప్పెల్ల గ్రామాల్లోని శివాలయాలకు తెల్లవారుజాము నుంచి భక్తులు వచ్చి అభిషేకాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు.

ఆత్రేయపురం: కార్తీకమాసం ఆఖరి సోమవారం వాడపల్లి అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో భక్తజనం పోటెత్తారు. వేకువజామునే నుంచి శివునికి అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. శివనామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. మహిళలు పుణ్యస్నానాలు ఆచరించి పవిత్ర నదులలో, ధ్వజస్తంబం వద్ద దీపాలంకరణ చేశారు. ర్యాలిలో స్వయంభూ ఉమాకమండలేశ్వరస్వామి ఆలయంలో అభిషేకాలు నిర్వహించారు. భక్తులు లైన్లలో బారులుదీరి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు.


ముమ్మిడివర్పాడులో పూర్ణాలంకరణలో ఉమావీరేశ్వరస్వామి

ద్రాక్షారామ: ద్రాక్షారామ భీమేశ్వరస్వామిని విశేష సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. తెల్లవారు జాము నుంచి భక్తుల రాక మొదలయింది. లైన్ల ద్వారా భక్తులు భీమేశ్వరస్వామి, మాణిక్యాంబ అమ్మవార్లను దర్శించుకున్నారు. సామూహిక అభిషేకాలు నిర్వహించారు. అశ్వత్థనారాయణ వృక్షం వద్ద కార్తీక దీపాలు వెలిగించారు. ఉదయం 9గంటల ప్రాంతానికి ఉచిత దర్శనం లైన్లలో భక్తులు బారులు తీరారు. ఆలయ సిబ్బంది, సేవకులు, ఇతర దేవాలయాల సిబ్బంది భక్తులకు సేవలందించారు. ఆలయ సహాయ కమిషనరు ఏవీ దుర్గాభవానీ, ఉత్సవ ప్రత్యేకాధికారి నాగేశ్వరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. పైండా వారి సత్రంలో యధావిధిగా అన్నదానం నిర్వహించారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈ సందర్భంగా నటుడు గౌతమ్‌రాజు భీమేశ్వరాలయాన్ని దర్శించి స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రావులపాలెం: మండలంలోని ముమ్మిడివరప్పాడు ఉమావీరేశ్వరస్వామి ఆలయంలో దీపోత్సవం నిర్వహించారు. పూర్ణాలంకరణలో స్వామివారు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కొత్తపేట: మండలంలోని పలివెల గ్రామ శ్రీ ఉమాకొప్పిలింగేశ్వరస్వామి ఆలయానికి తెల్లవారుజాము నుంచే విశేష సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయార్చకులు స్వామివారికి వేద మంత్రాలతో పంచామృతాలతో అభిషేకం జరిపారు. ఆలయాన్ని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు దర్శించుకుని దీపాలంకరణ పూజల్లో పాల్గొన్నారు. అనంతరం జరిగిన అన్నసమారాధన కార్యక్రమంలో భక్తులకు భోజనాలు వడ్డించారు. భక్తుల రద్దీని దృష్ట్యా దేవస్థానం అధికారులు ప్రత్యేక లైన్లు ఏర్పాటు చేశారు. మహిళలు కార్తీక దీపాలను వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.


ద్రాక్షారామలో సామూహిక అభిషేకాలు


ర్యాలిలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు


పలివెల ఉమాకొప్పిలింగేశ్వరుని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే బండారు

రజకుల సమస్యల పరిష్కారానికి కృషి

మంత్రి సుభాష్


మంత్రి సుభాష్, రామారావులను సత్కరిస్తున్న రజక నాయకులు

ద్రాక్షారామ, నవంవబరు 17(ఆంధ్రజ్యోతి): రజకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి సుభాష్ అన్నారు. సోమవారం ద్రాక్షారామలో వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డులో జరిగిన రజకుల కార్తీక వనసమారాధనకు ఆయన విచ్చేసి మాట్లాడారు.అసంపూర్తిగా ఉన్న సామాజిక భవనాల నిర్మాణానికి కృషి చేస్తానని, చెరువుల కేటాయింపు, పనిము ట్లు అందే విధంగా కృషి చేస్తానన్నారు.గుంటూరు-2 ఎమ్మెల్యే గల్లా మాధవి మాట్లాడుతూ రజకుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానన్నారు. సభకు అధ్యక్షత వహించిన రజక చైతన్య సేవా సంస్థ అధ్యక్షుడు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాకినాడ రామారావు మాట్లాడుతూ రజకులను 18 రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల్లో ఎస్సీ జాబితాలో చేర్చారని, ఏపీలో కూడా ఎస్సీ జాబితాలో చేర్చేందుకు మంత్రి సుభాష్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. జీవో 344 ప్రకారం ప్రభుత్వం గ్రామాల్లో చెరువులను రజకులకు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అక్కల రిష్వంత్‌రాయ్, డైరెక్టర్ కేశనకుర్తి వెంకటేశ్వరరావు, గుమ్మడి వెంకటరమణ, సూదికొండ రాముడు, కోటిపల్లి శివాజీ పాల్గొన్నారు.

జాతీయ కరాటే పోటీల్లో జొన్నాడ విద్యార్థుల ప్రతిభ

ఆలమూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కాకినాడలో జరిగిన జాతీయ కరాటే పోటీల్లో జొన్నాడ వారియర్ మాంక్స్ కుంగ్‌ఫ్యూ అకాడమీ విద్యార్థులు ప్రతిభ కనబరిచారని కోచ్ సత్తిబాబు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ బాలికల జూనియర్స్ వైట్‌బెల్ట్ విభాగంలో ఎంఎస్ ఉషశ్రీ ప్రథమస్థానం, బాయ్స్ ఎల్లో బెల్ట్‌లో చిరంజీవిరాజుకు ద్వితీయస్థానం, ఆరెంజ్ బెల్ట్‌లో కేజేడీ సాయిచరణ్ ప్రథమస్థానం, తాతపూడి జీవన్‌కుమార్, పాలిపి రాజేష్, కర్రి నాగసంతోష్ బహుమతులు సాధించారన్నారు. కోరుకొండ రితీష్‌కుమార్ గ్రాండ్ చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నట్టు సత్తిబాబు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఎంపీడీవో ఎ.రాజు, ఎంఈఓ.ప్రకాష్, కరాటే మాస్టర్ వెంకటరెడ్డి, నాయకులు అభినందించారు.

గ్రంథాలయ వారోత్సవాలు

ఆత్రేయపురం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం పేరవరం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు సరస్వతి దేవికి జ్యోతిప్రజ్వలన నిర్వహించారు. విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ సభ్యుడు కంటిపూడి రామారావు చిత్రలేఖన మెటీరియల్‌ను అందజేశారు. 106 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. ఆత్రేయపురం శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారులు శ్రీదేవి నిర్మల, తంబా నమ్మశివాయ పాల్గొన్నారు.

శనేశ్వరస్వామికి లక్ష రుద్రాక్ష పూజ

ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపోత్సవం

కొత్తపేట, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని మందపల్లిలో మందేశ్వర(శనేశ్వర) స్వామికి కార్తీకమాస చివరి సోమవారం సందర్భంగా లక్ష రుద్రాక్ష, లక్ష బిల్వార్చన పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు అయిలూరి శ్రీరామమూర్తి ఆధ్వర్యంలో వేదపండితులు కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలిగించారు. అనంతరం భారీ అన్నసమారాధన చేపట్టారు. ఆలయ సహాయ కమిషనరు, ఈవో దారపురెడ్డి సురేష్ బాబు ఆధ్వర్యంలో పాలక మండలి సభ్యులు, తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

శబరిమల యాత్రకు నాలుగు ఆర్టీసీ బస్సులు

రావులపాలెం డీఎం కుమార్

రావులపాలెం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): రావులపాలెం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి శబరిమల యాత్రకు నాలుగు ఆర్టీసీ బస్సులు సోమవారం బయలుదేరి వెళ్లినట్టు డిపో మేనేజర్ వైవీవీఎస్ కుమార్ తెలిపారు. స్వామిమాల ధరించిన భక్తుల సౌకర్యార్థం ప్రత్యేకంగా రావులపాలెం డిపో నుంచి శబరిమల యాత్రకు స్పెషల్ బస్సులు నడుపుతున్నామన్నారు. ఇప్పటి వరకూ 8 బస్సులు వెళ్లాయన్నారు. భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. స్వాముల సౌకర్యార్థం మరిన్నీ బస్సులు సిద్ధంగా ఉన్నట్టు డిపో మేనేజర్ తెలిపారు. వివరాలకు అసిస్టెంట్ మేనేజర్ నెంబరు 73829 11871ను సంప్రదించాలని కోరారు.

ఘనంగా ధన్వంతరి జయంతి

ఆలమూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఆరోగ్య ప్రదాత శ్రీధన్వంతరి స్వామి జయంతి మండలంలోని చింతలూరులో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఆలయానికి పలు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. చింతలూరు వేంకటేశ్వర ఆయుర్వేద నిలయం నిర్వాహకుడు డాక్టర్ సుజన్ దంపతులు ఆలయ ప్రాంగణంలో ధన్వంతరి వ్రతాన్ని ఆచరించారు.

వెంకన్న ఆలయంలో పూజలు

ఆత్రేయపురం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తీక సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామికి ఐశ్వర్యలక్ష్మి హోమం, బాలభోగం, నివేదన, నిత్య కల్యాణం, వ్రతాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. ఆలయ ఈవో నల్లం సూర్యచక్రధరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

శోభాయమానంగా భీమేశ్వరాలయం

నేడు ద్రాక్షారామలో కార్తీక దీపారాధన



ద్రాక్షారామ,నవంబరు17(ఆంధ్రజ్యోతి): కార్తీక దీపారాధన మహోత్సవానికి ద్రాక్షారామ శోభాయమానంగా ముస్తాబయ్యింది. ప్రసన్నాంజనేయ బాలభక్త సమాజం ఆధ్వర్యంలో మంగళవారం కార్తీక దీపారాధన మహోత్సవం జరుగనుంది. కార్తీక మాసం ఆఖరు మంగళవారం సందర్భంగా భీమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయం వద్ద 62వ దీపారాధనకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం, సప్త గోదావరి నది ఒడ్డున, బోసుబొమ్మ సెంటర్‌లో మిరుమిట్లు గొలిపే విద్యుత్ దీపాలను అలంకరించారు. సాంస్కృతిక కార్యక్రమాల వేదికను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.

ఇవీ కార్యక్రమాలు.. ఉదయం 6గంటలకు ప్రసన్నాంజనేయస్వామికి లక్ష తులసి పూజ, పంచామృతాభిషేకం నిర్వహిస్తారు. మంత్రి వాసంశెట్టి సుభాష్ దంపతులు పూజాదికాల్లో పాల్గొంటారు. మధ్యాహ్నం 1 గంటకు ఉష్ట్రవాహనంపై స్వామివారి నగరోత్సవం జరుగుతుంది. దీనిని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ ప్రారంభిస్తారు. 4 నుంచి 5 గంటలవరకు అక్కిరెడ్డి అబ్బు బృందం ఆధ్వర్యంలో భజనకాలక్షేపం జరుగుతుంది. 5.24 గంటలకు అఖండ దీపారాధనను ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు దంపతులు ప్రారంభిస్తారని బాలభక్త సమాజం అధ్యక్షుడు బోనం శ్రీను తెలిపారు.

సాంస్కృతిక కార్యక్రమాలు.. దీపారాధన సందర్భంగా శుభమ్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో సినీగాయకులతో సంగీత విభావరి, నరాల సత్తిబాబు ఆధ్వర్యంలో బాణసంచా కాల్పులు,ఉమా శ్రీవాణి కళానికేతన్ ఆధ్వర్యంలో వార్‌సీన్‌ల ప్రదర్శనలు జరుగుతాయి.